https://teluguislam.net



# గజ్వయె అహ్జాబ్ (అగడ్త యుద్ధం)

ఇలా ఎడతెగకుండా జరిగిన సైనిక చర్యలు, యుద్ధాలు ముగిసిన తరువాత అరేబియా ద్వీపకల్పంలో ప్రశాంతత నెలకొంది. శాంతిభద్రతలు ఎల్లెడలా వ్యాపించాయి. ఎటు చూసినా ప్రశాంత వాతావరణమే కానవచ్చింది. కాని యూదులకు మాత్రం ఇంకా స్పృహ రాలేదు. వారు తమ కుట్రలు, కుతంత్రాల వల్ల అనేక రకాలుగా అగౌరవంపాలైనా వారికి ఇంకా బుద్ధి రాలేదు. వీరు తమ ఈ వైఖరి వల్ల ఉత్పన్నమైన దుష్పరిణామాల నుండి ఎలాంటి గుణపాఠమూ నేర్చుకోలేదు. మదీనా నుండి దేశ బహిష్కరణకు గురై ఖైబర్ చేరిన తరువాత వారు, విగ్రహారాధకులు మరియు ముస్లిముల నడుమ జరుగుతున్న సంఘర్షణ ఫలితాలను వేచిచూడనారంభించారు. కాని పరిస్థి తులు ముస్లిములకే అనుకూలంగా మారడం గమనించి, ఎటు చూసినా వారి మాటే చెల్లడం చూసి అగ్గి మీద గుగ్గిలం అయిపోయారు. క్రొత్త తరహా కుట్రను ప్రారంభిస్తూ వారు ముస్లిములపై చిట్టచివరి ప్రహారం చేయడానికి సంసిద్ధులయ్యారు. దీని ఫలితంగా నామరూపాల్లేకుండా పోతామనే ధ్యాసే వారికి లేకుండాపోయింది. ఈ లక్ష్యసాధన కోసం యూదులు ఓ భయం కరమైన క్రొత్త పథకాన్ని సిద్ధం చేశారు.

బనూ నజీర్ తెగకు చెందిన ఇరవై మంది సర్దారులు కలసి మక్కాలోని ఖురైషు నాయకుల వద్దకు వెళ్ళారు. వారిని దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా యుద్ధం కోసం పురికొల్పుతూ, తమ సహాయం కూడా ఉంటుందని నమ్మ బలికారు. ఖురైషులు వారి ఈ కల్లబొల్లి మాటలను నమ్మి యుద్ధం కోసం సంసిద్ధం కాసాగారు. ఉహద్ యుద్ధం రోజున, తిరిగి బద్ర్ మైదానంలో తలపడ డానికి సిద్ధంగా ఉండమని సవాలు విసిరి ఉండడం, ఆ సవాలును తామే విరమించుకోవడం వల్ల వారికి తలకొట్టేసినట్లయింది. ఇప్పుడు యుద్ధం చేసి తాము పోగొట్టుకున్న గౌరవమర్యాదలను తిరిగి రాబట్టుకోవచ్చు, తాము విసిరిన సవాలును కూడా నిలుపుకోవచ్చు అని భావించారు.

https://teluguislam.net



పిదప యూదుల ప్రతినిధి వర్గం బనూ గత్ఫాన్ తెగ వద్దకు వెళ్ళింది. ఖురైషులను ఒప్పించినట్లే వారిని కూడా కదన రంగంలోకి దుమకడానికి సిద్ధపరిచింది. బనూ గత్ఫాన్ వారు యుద్ధానికి సిద్ధపడ్డారు. ఆ తరువాత ఈ యూదుల ప్రతినిధి వర్గం అరేబియా అంతటా తిరిగి ఇతర తెగల ప్రజలను యుద్ధం కోసం పురికొల్పనారంభించింది. ఆ తెగలు కూడా యుద్ధానికి సన్నద్ధం కానారంభించాయి. ఇలా యూదుల రాజకీయ నాయకులు విజయవంతంగా దైవధిక్కారుల గొప్ప గొప్ప తెగలను, సమూహాలను దైవప్రవక్త (స)కూ, ఆయన సందేశానికీ, ముస్లిములకూ వ్యతిరేకంగా యుద్ధాగ్నిలో దుమకడానికి సిద్ధపరిచారు.

ఆ తరువాత వారు తాము అనుకున్న ప్లాను ప్రకారం దక్షిణ దిశ నుండి ఖురైష్, కనానా మరియు తహామాలో నివసించే ఇతర మిత్రపక్షాల తెగలతో సహా మదీనా వైపునకు బయలుదేరారు. ఈ సైన్యం సర్వసైన్యా ధ్యక్షుడు అబూ సుఫ్యాన్. ఈ సైనికుల సంఖ్య మొత్తం నాల్గు వేలు. ఇది మర్రఉజ్జొహ్రాన్‌కు చేరగానే బనీ సులైమ్ తెగ కూడా వచ్చి వీరితో కలిసి పోయింది. అటు ఆ సమయంలోనే తూర్పు వైపు నుండి గత్ఫాన్ తెగలైన ఫజారా, ముర్రా మరియు అష్జాలు కూడా బయలుదేరారు. ఫజారా సైన్యాధ్యక్షుడు యుయైనా బిన్ హస్న్, బనూ ముర్రా కమాండరు హారిస్ బిన్ ఔఫ్ మరియు బనూ అష్జా నాయకుడు 'మస్అర్ బిన్ రఖీలా'లు. వీరి వెంటే బనూ అసద్, ఇంకా ఇతర తెగలకు చెందిన వారు చాలా మంది ఉన్నారు.

ఈ తెగలన్నీ అనుకున్న సమయంలో, నిర్ణీత ప్రోగ్రామ్‌ననుసరించి మదీనాకు బయలుదేరాయి. కొన్ని రోజులలోనే మదీనా దాపున పదివేల మంది సైనికులతో కూడిన ఓ మహా సేన ఓ చోట చేరుకుంది. ఇంత బ్రహ్మాండమైన సేనకు పూర్తి మదీనా జనసంఖ్య (స్త్రీలు, పిల్లలు, వృద్ధులు మరియు యువకు లను కలిపి) కూడా తక్కువే. ఒకవేళ దాడి చేయడానికి వచ్చిన ఈ సేనావాహిని మదీనా పొలిమేరల్లోకి వచ్చేస్తే ముస్లిములకు పెద్ద ప్రమాదమే వాటిల్లగలదు. వారు నామరూపాల్లేకుండా పోతారనడంలో సందేహం కూడా లేదు. అయితే మదీనా నాయకత్వం ఎంతో మెలుకువ మరియు జాగ్రత్తలు కలిగిన నాయ కత్వం. ఆ నాయకత్వం ఎల్లప్పుడూ

https://teluguislam.net



పరిస్థితులను గమనిస్తోంది. దాన్ని బేరీజు వేసుకోవడానికి జరగబోయే సంఘటనలను దృష్టిలో ఉంచుకొని, వాటిని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించే వివేచనగల నాయకత్వం అది. దైవవిరోధుల ఈ మహా సేన కదలికలను గమనించిన మదీనా వేగులు వెంటనే దైవప్రవక్త (స)కు పరిస్థితులను గురించి తెలియజేశారు.

ఈ వార్తలు అందగానే మహాప్రవక్త (స), హైకమాండ్‌కు (అధిష్ఠాన వర్గం) చెందిన సలహా సంఘాన్ని సమావేశపరిచారు. వారితో ఆత్మరక్షణకు సంబంధించిన సలహాలు ఇవ్వమని అడిగారు. సలహా సంఘం నాయకులు ఎంతో విజ్ఞతతో ఆలోచించి, హజ్రత్ సల్మాన్ ఫార్సీ (ర)గారు ఇచ్చిన సలహాను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ సలహా ఏమిటంటే, హజ్రత్ సల్మాన్ ఫార్సీ(ర) దైవప్రవక్త (స)తో, "మహాప్రవక్తా! ఎప్పుడైనా మేము చుట్టుముట్టబడినప్పుడు మా చుట్టూ కందకం త్రవ్వుకొని మా ఆత్మరక్షణ చేసుకునేవారం" అనే సలహా ఇచ్చి ఉన్నారు.

ఇది ఎంతో బుద్ధివివేకాలతో కూడిన సలహా. అరబ్బులకు ఈ యుద్ధ విధానం గురించి తెలియదు. దైవప్రవక్త (స) వెంటనే ఈ సలహాను అమలు చేయమని చెబుతూ, ప్రతి పది మంది గల బృందానికి నలభై మూరల కందకం త్రవ్వే పనిని అప్పగించేశారు. ముస్లిములు ఎంతో కష్టపడి ఏకాగ్రతతో ఆ అగడ్తను త్రవ్వే పనిని మొదలెట్టారు. మహాప్రవక్త (స) వారిని ప్రోత్సహిస్తూ తాము కూడా ఆ త్రవ్వకంలో పాలుపంచుకున్నారు. సహీ బుఖారి గ్రంథంలో హజ్రత్ సహెల్ బిన్ సఅద్ (ర) ఇలా ఉల్లేఖిస్తున్నారు:

మేము దైవప్రవక్త (స)తో కలసి ఆ అగడ్తను త్రవ్వుతున్నాం. ముస్లిములు తమ భుజాలపై మట్టి తట్టలు పెట్టుకొని మోస్తున్నారు. ఈ సందర్భంలోనే మహాప్రవక్త (స) దేవుణ్ణి ఇలా వేడుకుంటున్నారు.

"ఓ అల్లాహ్! జీవితం కేవలం పరలోక జీవితమే. ముహాజిర్లు, అన్సారులు ఉభయుల్నీ మన్నించు."[1]

హజ్రత్ అనస్(ర) గారు ఉల్లేఖించిన మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: "దైవప్రవక్త (స) కందకం వైపునకు వచ్చి చూడగా అన్సార్లు మరియు

1. సహీ బుఖారి-గజ్వాయె అహ్జాబ్ అధ్యాయం-2/588

https://teluguislam.net



ముహాజిర్లు కలసి ఉదయం పూట ఎముకలు కొరికే చలిలో త్రవ్వకం కొనసాగిస్తూ ఉన్నారు. వారికి సహాయపడడానికి వారి వద్ద బానిసలు కూడా లేరు. ఆకలి బాధలోనూ వారి ఈ కష్టాన్ని చూసి మహాప్రవక్త (స) ఇలా దుఆ చేశారు.

"ఓ ప్రభూ! జీవితం తప్పకుండా పరలోక జీవితమే. కాబట్టి అన్సారులను, ముహాజిర్లను మన్నించు."

ఇది విన్న అన్సారులు, ముహాజిర్లు దానికి సమాధానంగా, "మేము బ్రతికి ఉన్నంత కాలం, సతతం జిహాద్ చేయడానికి ముహమ్మద్ (స) గారి చేతి మీదుగా ప్రమాణం చేసి ఉన్నాం" అన్నారు."[2]

సహీ బుఖారీ గ్రంథంలోనే మరో ఉల్లేఖనం హజ్రత్ బరా బిన్ ఆజిబ్(ర) ఉల్లేఖించనట్లుంది. ఆయన ఇలా అంటారు:

"నేను మహాప్రవక్త (స) కందకం నుండి మట్టి మోస్తూ వెళ్ళగా చూశాను. ఇలా మోస్తున్నప్పుడు ఆయన పొట్టంతా దుమ్ముతో కప్పివేయబడి ఉంది. ఆయన (స)గారికి పొట్టపై దట్టంగా వెంట్రుకలు ఉన్నాయి. ఆ పరిస్థితిలోనే ఆయన అబ్దుల్లా బిన్ రవాహా యుద్ధ సమయంలో చెప్పిన పద్యపాదాలను వల్లిస్తూ ఉండగా విన్నాను. ఆ పద్యపాదాలు ఇలా ఉన్నాయి:

"ఓ అల్లాహ్! నీవే లేకపోతే మేము సన్మార్గాన్ని పొందేవారం కాదు. దానధర్మాలు చేయడం, నమాజు సల్పడం చేసేవారం కాదు. ఓ అల్లాహ్! మాపై స్థిమితాన్ని వర్షింపజెయ్యి. యుద్ధమే చేయాల్సి వస్తే మమ్మల్ని స్థిరంగా ఉంచు. వీరు మాకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టారు. వారేగనక ఏదైనా సంక్షోభాన్ని రేకెత్తిస్తే మేము దానికి తలవంచేవారం కాదు."

దైవప్రవక్త (స) చివరి అక్షరాలను కొంత ఒత్తి పలికేవారని హజ్రత్ బరా (ర) చెబుతారు. మరో ఉల్లేఖనంలోని ఆ చివరి పద్యపాదాలు ఇలా ఉన్నాయి.

"వారు మాపై జులుము చేశారు. వారే మమ్మల్ని సంక్షోభంలోకి నెట్టదలచుకుంటే మాత్రం మేము వారికి తలవంచేవారం కాదు."[3]

ముస్లిములు ఉత్సాహంగా ఓ వైపు అలా పని చేస్తూ పోతుంటే మరో ప్రక్క అంతే తీవ్రమైన ఆకలి బాధతోనూ అలమటిస్తున్నారు. ఆ పరిస్థితి

2. సహీ బుఖారి-1/397, 2/588 3. సహీ బుఖారి-2/589

https://teluguislam.net



చూసేవారి గుండెలు పగిలిపోగలవు.

హజ్రత్ అనస్ (ర)గారి ఉల్లేఖనంలో, దైవప్రవక్త (స) గారి వద్దకు రెండు దోసిళ్ళ జౌ ధాన్యం తీసుకురావటం జరిగింది. దానికి కొంత నూనెను కలిపి ఆయన తినడానికి పని చేసే వారి ముందు ఉంచేవారు. అది మ్రింగుడు పడని ఆహార పదార్థం. అయితే అందులో నుండి సువాసన వెలువడింది[4] అని ఉంది.

అబూ తల్హా (ర) ఇలా అంటారు:

"మేము ఆకలి బాధను భరించలేక దైవప్రవక్త (స) ముందుకు వచ్చి మా పొట్టలపై కట్టబడివున్న ఒక్కొక్క రాయిని చూయించాం. అది చూసిన మహాప్రవక్త (స) తన పొట్ట మీది నుండి చొక్కాను ఎత్తి చూయించగా, దాని మీద రెండు రాళ్ళువేసి కట్టుకొని ఉన్నారు (అది చూసి మేము సిగ్గుపడ్డాము).[5]

కందకం త్రవ్వేటప్పుడు దైవప్రవక్త (స) ద్వారా అనేక చమత్కారాలు వెలుగులోనికి వచ్చాయి. సహీ బుఖారి ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ జాబిర్ (ర) దైవప్రవక్త (స)గారు ఆకలి బాధతో అలమటించగా చూసి ఓ మేక పిల్లను జిబహ్ చేశారు. ఆయన భార్య ఓ సాఅ (దాదాపు రెండున్నర కిలో గ్రాముల) ఓట్లను విసరి ఎవరికీ తెలియకుండా మహాప్రవక్త (స) ముందు తినమని తెచ్చిపెట్టారు. కొందరు సహచరులను తినడానికి పిలుచుకురమ్మని ఆజ్ఞాపించారు. కాని దైవప్రవక్త (స) కందకం త్రవ్వేవారందరినీ పిలుచుకొని ఆమె ఇంటికి భోజనానికి బయలుదేరి వెళ్ళారు. వారి సంఖ్య మొత్తం వేయి మంది. అందరూ ఆ కొద్ది భోజనం ముందు కూర్చుని తిననారంభించారు. అందరూ కడుపార భుజించారు. అయినా ఆ మాంసం పాత్ర మాత్రం ఎప్పటి లాగే నిండుగా ఉంది. కలుపబడిన పిండి ఎంత మాత్రం తగ్గడం లేదు. ఆమె రొట్టెలు చేసి అందరికీ వడ్డిస్తూనే ఉన్నారు.[6]

హజ్రత్ నోమాన్ బిన్ బషీర్ సోదరి కందకం వద్దకు తన సోదరుడు భుజించాలనే ఉద్దేశ్యంతో రెండు దోసిళ్ళ ఖర్జూరాలను పట్టుకొచ్చారు. ఆమె దైవప్రవక్త (స) ముందుగా వెడుతూ ఉంటే, ఆయన(స) ఆ ఖర్జూరాలను

4. సహీ బుఖారి-2/588
5. ఈ సంఘటన సహీ బుఖారిలో ఉల్లేఖించబడి ఉంది. చూడండి, 2/588,589
6. ఈ సంఘటన సహీ బుఖారిలో ఉల్లేఖించబడింది. చూడండి, 2/588,2/589

https://teluguislam.net



అడిగి తీసుకున్నారు. వాటిని ఓ వస్త్రంపై పరచి పనిచేస్తున్న వారందరినీ తినమని పిలుపునిచ్చారు. వారందరూ వచ్చి దాని చుట్టూ కూర్చుని తినటారంభించారు. ఆ ఖర్జూరాలు పెరుగుతూ పోతున్నాయి. చివరికి అందరూ కడుపునిండా వాటిని భుజించి వెళ్ళిపోయినప్పటికీ ఆ ఖర్జూరాలు ఆ వస్త్రం అంచుల నుండి బయటపడిపోతున్నాయి.[7]

ఆ కాలంలోనే ఈ రెండు సంఘటనలకు మించిన మరో సంఘటన కూడా జరిగింది. ఇది ఇమామె బుఖారి, హజ్రత్ జాబిర్ (ర) గార్ల ఉల్లేఖనాల నుండి గ్రహించిన సంఘటన. హజ్రత్ జాబిర్ (ర)గారు ఇలా ఉల్లేఖించారు.

"మేము అగడ్తను త్రవ్వుతూ ఉండగా ఓ శిల అడ్డుపడింది. అది ఎంతకూ పగలకపోయేసరికి ముస్లిములు దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి ఈ గండు శిలలాంటి రాయి అడ్డుపడడం వల్ల కందకం పని ఆగిపోయిందని చెప్పారు. ఇది విన్న దైవప్రవక్త (స), ఆగండి! నేను కూడా దిగుతున్నానని ఆయన (స) కందకం లోనికి దిగారు. అప్పుడు ఆయన పరిస్థితి, ఆకలి బాధతో పొట్టపై రాయి కట్టుకొని ఉన్న పరిస్థితి- మేమూ మూడు రోజుల నుండి ఏ పదార్థమూ తినలేదు- ఆ తరువాత మహాప్రవక్త (స) తన గొడ్డలి (గడ్డపార)తో ఆ బండపై వ్రేటువేయగా ఆ బండరాయి పైకి ఉబికి ఉన్న ఓ మట్టి దిబ్బగా మారిపోయింది."[8]

హజ్రత్ బరా (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, కందకం త్రవ్వేటప్పుడు ఓ చోట ఓ గట్టి చట్టుబండ అడ్డం వచ్చింది. దానిపై వ్రేటువేయగా గడ్డపార ఎగిరెగిరిపడుతోంది. అది ఏ మాత్రం తునగడం లేదు. మేము దైవప్రవక్త (స) వద్దకు వచ్చి దాన్ని గురించి చెప్పుకోగా ఆయన కందకంలో దిగి గడ్డపలుగును తీసుకొని బిస్మిల్లాహ్ అంటూ ఓ దెబ్బ వేశారు (అప్పుడు ఓ ముక్క విరిగి పడిపోయింది). అప్పుడాయన "అల్లాహు అక్బర్! నాకు సిరియా దేశపు తాళపు చేతులు ఇవ్వబడ్డాయి. దైవసాక్షి! నేనిప్పుడు అక్కడి ఎరుపురంగు మహళ్ళను నా కళ్ళతో చూస్తున్నాను" అని అన్నారు. మరో దెబ్బ వేయగా మరో ముక్క విరిగిపడిపోయింది. అప్పుడు మహాప్రవక్త (స), "అల్లాహు అక్బర్! నాకు పర్షియా ఇవ్వబడింది. దైవసాక్షి! నేనిప్పుడు మదాయన్‌కు సంబంధించిన శ్వేతసౌధాన్ని చూస్తున్నాను" అన్నారు. ఆ తరువాత బిస్మిల్లాహ్ అంటూ

7. ఇబ్నె హిషామ్-2/218

8. సహీ బుఖారి-2/588

https://teluguislam.net



మూడవ వ్రేటువేయగా మిగిలిన బండ పూర్తిగా తెగిపడిపోయింది. ఆ తరువాత ఆయన, "అల్లాహు అక్బర్! నాకు యమన్ తాళాలు ఇవ్వబడ్డాయి. దైవసాక్షి! నేనిప్పుడు ఇక్కడి నుండి సన్‌ఆ కోట గుమ్మాలను చూస్తున్నాను" అని అన్నారు.[9]

ఇబ్నె ఇస్‌హాక్, ఇలాంటిదే మరో ఉల్లేఖనాన్ని సల్మాన్ ఫార్సీ ఉల్లేఖించినట్లుగా రాశారు.[10]

మదీనా పట్టణం ఉత్తర దిశను వదిలేసి మిగిలిన మూడుప్రక్కలా లావా కొండ శిలలతో, కొండలతో మరియు ఖర్జూరపు తోటలతో పరివేష్టించబడి ఉంది. మహాప్రవక్త (స) ఓ నైపుణ్యంగల సైన్యాధ్యక్షునిలా, మదీనాపై దాడి కేవలం ఉత్తర దిశ నుండే జరగవచ్చని ఊహించారు. కాబట్టే ఆయన మదీనాకు ఉత్తర దిశగా కందకాన్ని త్రవ్వించడం జరిగింది.

ముస్లిములు అలుపూసొలుపూ లేకుండా కందకాన్ని త్రవ్వుతూనే ఉన్నారు. పగలు కందకాన్ని త్రవ్వుతూ రాత్రి కాగానే ఇండ్లకు వెళ్ళిపోయేవారు. మదీనా పొలిమేరల వరకు దైవతిరస్కారుల సైన్యం చేరేటప్పటికీ ఈ పని పూర్తి అయిపోయింది.[11]

ఇటు ఖురైషులు తమ నాల్గు వేల సైనికులతో మదీనా దాపున ఉన్న రోమా, జుర్ఫ్ మరియు జగాబాలకు నడుమగల మజ్మ ఉల్ అస్‌యాల్ అనే ప్రదేశంలో విడిది చేశారు. మరోవంక గత్ఫాన్ మరియు వారి నజద్‌కు చెందిన సహచరులు ఆరు వేల మందితో ఉహద్ పర్వతం తూర్పు ప్రక్కన 'జన్బె నఖమీ' అనే ప్రదేశంలో వచ్చి దిగారు.

ముస్లిములు ఈ సేనను చూసినప్పుడు వారి పరిస్థితి ఎలా ఉందో దివ్యఖుర్‌ఆన్ ఇలా వివరిస్తోంది.

وَلَمَّا رَاَ الْمُؤْمِنُوْنَ الْاَحْزَابَ ۙ قَالُوْا هٰذَا مَا وَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗ
وَصَدَقَ اللّٰهُ وَرَسُوْلُهٗ ۫ وَمَا زَادَهُمْ اِلَّاۤ اِيْمَانًا وَّتَسْلِيْمًا ۟

"సత్యవిశ్వాసులు దాడి చేసిన సైన్యాలను చూసినప్పుడు (వారి స్థితి ఇలా

9. సునన్ నిసాయీ-2/56, ముస్నదె అహ్మద్ 10. ఇబ్నె హష్షామ్-2/21
11. ఇబ్నె హష్షామ్-3/220,221

https://teluguislam.net



**ఉంది). వారు ఇలా పలికారు: "అల్లాహ్, ఆయన ప్రవక్త మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే. అల్లాహ్ ఆయన ప్రవక్త నిజమే పలికారు." ఈ సంఘటన వారి విశ్వాసాన్నీ, వారి ఆత్మ సమర్పణనూ మరింత అధికం చేసింది." (33 : 22)**

కాని వంచకులు మరియు రోగగ్రస్త హృదయులు ఆ సైన్యాన్ని చూడగానే వారి గుండెలు దడదడలాడాయి. ఈ విషయాన్నే దివ్యఖుర్‌ఆన్ ఇలా వివరిస్తోంది:

وَإِذْ يَقُولُ الْمُنٰفِقُوْنَ وَالَّذِيْنَ فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ مَّا وَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗٓ اِلَّا غُرُوْرًا ۝

**"(ఓ ప్రవక్తా!) కపటులూ, రోగగ్రస్త హృదయులూ అందరూ, "అల్లాహ్, ఆయన ప్రవక్త మనతో చేసిన వాగ్దానాలన్నీ భ్రమలు తప్ప మరేమీ కావు" అని స్పష్టంగా ప్రకటించినప్పటి సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో." (33:12)**

ఎలాగైతేనేమి ఆ సేనను ఢీకొనడానికి దైవప్రవక్త (స) కూడా మూడు వేల మంది ముస్లిముల సేనను తీసుకొని అక్కడికి వచ్చారు. సలా పర్వతాన్ని వెనుకగా ఉంచి సంరక్షణ వలయాన్ని ఏర్పరిచారు. ఇక ముందు ఉన్నది అగడ్తే. ఇది ముస్లిములకు 'దైవధిక్కారులకు నడుమ అడ్డుగా ఉంది. ముస్లిముల కోడ్ వర్డ్ (సంకేత పదం) "హామ్మీమ్ లా యున్సరూన్" (అంటే హామ్మీమ్ వారికి ఎలాంటి సహాయం అందబోదు అని అర్థం). మదీనా పాలనా బాధ్యతను హజ్రత్ ఉమ్మె మక్తూమ్ (ర)గారికి అప్పజెప్పడం జరిగింది. స్త్రీలను, పిల్లలను మదీనా కోటల్లోనూ, చిన్న చిన్న గఢాలలోనూ సురక్షితంగా ఉంచడం జరిగింది.

బహుదైవారాధకులు మదీనాపై దండెత్తడానికి దాని దాపుకు రాగానే వారికి అడ్డంగా ఓ వెడల్పాటి కందకం అగుపడింది. విధిలేక వారు అక్కడనే ఆగిపోవలసివచ్చింది. వారు ఇండ్ల నుండి బయలుదేరేటప్పుడు ఈ పరిస్థితిని ఎదుర్కోవలసివస్తుందని అనుకోలేదు. ఎందుకంటే ఆత్మరక్షణకు సంబంధించిన ఈ ఎత్తుగడ- వారు చెప్పేదాని ప్రకారం- ఇప్పటి వరకు అరబ్బులకు తెలియని ఎత్తుగడ. కాబట్టి వారు దీనికి ఏమాత్రం సిద్ధమై రాలేదు.

https://teluguislam.net



బహు దైవారాధకులు అగడ్త దగ్గరకు వచ్చి క్రోధం మితిమీరేటట్లు దాని ప్రక్కగా చిందులేయనారంభించారు. అగడ్తలో దిగడానికి ఏదైనా బలహీన మైన ప్రదేశం కనబడుతుందేమోనని వెతకనారంభించారు. ఇటు ముస్లిములు వారి రాకపోకలను ఓ కంట కనిపెట్టుకునే ఉన్నారు. వారిపై బాణాల వర్షాన్ని కురిపిస్తూ కందకం దగ్గరకు రాకుండా చూస్తున్నారు. కందకాన్ని పూడ్చడానికి గాని, అందులో దుమికి ముస్లిముల వైపునకు రావడానికిగాని అవకాశం ఇవ్వడం లేదు.

ఇటు ఖురైష్ అశ్వారూఢులకు, కందకానికి ఈ ప్రక్కన ఎదురు చూస్తూ కాలం గడపడం భరింపరానిదైపోతోంది. అది వారి గౌరవానికే మచ్చ. కాబట్టి ఆ అశ్వారూఢుల ఓ బృందం ఓ ఇరుకైన ప్రదేశం నుండి కందకాన్ని దాటటంలో విజయం సాధించగలిగింది. ఆ బృందంలో అమ్రూ బిన్ అబ్దె ఉద్, ఇక్రమా బిన్ అబీ జహల్ మరియు జిరార్ బిన్ ఖత్తాబ్ కూడా ఉన్నారు. వీరు ఓ ఇరుకైన చోటు నుండి గుర్రాలను దూకించి ఇవతలికి వచ్చారు. 'సలా' కొండ మరియు కందకం నడుమన గుర్రాలు పరుగెత్తిస్తున్నారు. ఇటు ముస్లిముల వైపు నుండి హజ్రత్ అలి (ర) కొందరు యోధులను తీసుకొని వారు గుర్రాలను దూకించిన ప్రదేశంలోనికి వెళ్ళి నిలబడ్డారు. వారు ఇక వెనక్కు పోయే మార్గాన్ని మూసేశారు. ఇది చూసిన అమ్రూ బిన్ అబ్దె ఉద్ వ్యక్తిగత పోరాటానికి తొడ చరిచి పిలిచాడు. హజ్రత్ అలి (ర) అతణ్ణి ఎదుర్కోడానికి ముందుకు వచ్చారు. ఆయన ఎత్తి పొడుపు మాటకు అతని ఉక్రోషం మిన్నుముట్టింది. ఆ క్రోధంలో అతను గుర్రం దూకి దాని కాళ్ళు నరికేశాడు. ఆ తరువాత తొడ చరిచి హజ్రత్ అలి (ర)కి ఎదురుగా వచ్చేశాడు. అతను మహా బలవంతుడూ, ధైర్యసాహసాలు గల పహిల్వాను. ఆ ఇద్దరి నడుమ భీకరంగా యుద్ధం జరుగుతోంది. ఒకరిపై ఒకరు ఖడ్గప్రహారాలు చేస్తున్నారు. చివరికి హజ్రత్ అలి (ర) అతణ్ణి అంతమొందించేశారు. మిగిలిన బహుదైవారాధకులు కందకం దాటేసి పారిపోయారు. ఆ హత్యతో ముష్రిక్కులు భయభీతి చెందిపోయారు. ఇక్రమా అయితే పారిపోతూ తన శూలాన్ని కూడా తీసుకొని వెళ్ళడం మరచిపోయాడు.

బహు దైవారాధకులు కొన్ని రోజుల వరకు కందకాన్ని దాటడానికి, దాన్ని మూసేసి మార్గం సుగమం చేయడానికి శతవిధాలా ప్రయత్నం చేశారు.

https://teluguislam.net



కాని ముస్లిములు వారిని ఎంతో చాకచాక్యంగా అలా చేయకుండా అడ్డు కున్నారు. అలాగే శర పరంపరలతో వారిని దగ్గరకు రాకుండా చేస్తూ అటు వైపు నుండి వచ్చిపడే బాణాల నుండి తమను తాము రక్షించుకుంటూ ఉన్నారు.

ఇలా జరిగిన దాడుల సందర్భంలోనే మహాప్రవక్త (స)గారి మూడు పూటల నమాజు పోయింది. సహీయైన్‌లో హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది; "హజ్రత్ ఉమర్ (ర) కందకం యుద్ధం నాడు బహుదైవారాధకు లను తిట్టారు కూడా. ఆయన దైవప్రవక్త (స) దగ్గరకొచ్చి ఓ దైవప్రవక్తా! నేను ఈ రోజు సూర్యాస్తమయ్యేటప్పుడుగాని నమాజు చేయడానికి కుదిరింది కాదు అని అనగా, మహాప్రవక్త (స), "దైవసాక్షి! నేనైతే ఇంకా నమాజే చేయలేదు" అని అన్నారు. ఆ తరువాత మేమందరం కలిసి బత్‌హాన్ అనే ప్రదేశానికి వెళ్ళి వుజూ చేశాం. ఆ తరువాత ఆయన మొదట అస్ర్ నమాజ్ చేశారు. ఇది సూర్యుడు అస్తమించినప్పటి విషయం. ఆ తరువాతగాని మగ్రిబ్ నమాజు చేయలేదు."[12]

దైవప్రవక్త (స)కు నమాజు చేయలేకపోయినందుకు ఎంతో బాధ కలిగింది. ఆ బాధతో ఆయన బహుదైవారాధకులను శపించారు కూడా. సహీ బుఖారీ గ్రంథంలో హజ్రత్ అలీ (ర) గారి ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం, దైవప్రవక్త (స) అగడ్త యుద్ధం రోజున, "అల్లాహ్ ఈ బహుదైవారాధకులకు తోడు వారి ఇళ్ళను, వారి సమాధుల్ని అగ్నితో నింపేయుగాక! మమ్మల్ని వీరు సూర్యాస్తమయం అయినా 'నమాజె వుస్తా'ను చేయకుండా అడ్డు కున్నారు"[13] అని శపించారు.

ముస్నదె అహ్మద్ మరియు ముస్నదె షాఫయీలోని ఉల్లేఖనాల ప్రకారం, ముష్రిక్కులు దైవప్రవక్త (స)ను జుహ్ర్, అస్ర్, మగ్రిబ్ మరియు ఇషా నమాజులు చేయకుండా యుద్ధంలో నిమగ్నులుగా చేశారు. ఆయన ఈ మొత్తం నమాజులు ఒకేసారి చేశారు. ఇమామె నోవీ (రహ్మాలై), ఈ ఉల్లేఖ నాల నడుమగల తేడాలను ఉటంకిస్తూ, కందక యుద్ధం చాలా రోజుల వరకు కొనసాగిందని, ఓ రోజు ఓ నమాజు ఖజా అయితే, మరో రోజు మరో నమాజు ఖజా అయి ఉండవచ్చని అంటారు.[14]

12. సహీ బుఖారి-2/590 13. సహీ బుఖారి-2/590
14. ముక్తసరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్-పుట 287; షరహ్ ముస్లిమ్ లిల్‌నూవీ-1/227

https://teluguislam.net



ఇలా జరగడం వల్లనే బహుదైవారాధకులు కందకాన్ని దాటడానికి సతతం ప్రయత్నిస్తూనే ఉన్నారని, దాన్ని ముస్లిములు అడ్డుకోవడం జరిగిం దన్నది వ్యక్తమవుతోంది. ఆ ఇరుసేనలకు నడుమ కందకం ఉండడం వలన ఎదురెదురు దాడి జరిగే అవసరమే కలుగలేదు. కేవలం బాణాల యుద్ధం ఒక్కటే జరిగింది.

ఈ బాణాల యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన కొందరు చని పోయారు. అయితే వారి సంఖ్య బహు తక్కువ. అంటే ఆరుగురు ముస్లిములు, పది మంది ముష్రిక్కులు చనిపోయారు. వీరిలోనూ ఒకరిద్దరు ఖడ్గఘాతం వల్ల హతులైనారు.

ఈ శరపరంపర సందర్భంలోనే హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర)కు కూడా ఓ బాణం వచ్చి తగిలింది. దీనివల్ల ఆయన చేతి ప్రధాన నరం ఒకటి తెగిపోయింది. ఆయనకు బాణం వేసింది హబ్బాన్ బిన్ అర్కా అనేవాడు. ఇతను ఖురైష్‌కు చెందిన ముష్రిక్కు. హజ్రత్ సఅద్(ర) (గాయపడ్డ తరువాత) దేవుణ్ణి ఇలా వేడుకున్నారు. "ఓ అల్లాహ్! ఏ జాతి అయితే నీ ప్రవక్త (స)ను ధిక్కరించిందో, ఆయన్ను ఇంటి నుండి గెంటివేసిందో, వారితో నీ మార్గంలో యుద్ధం చేయడం ఎంత ప్రియమైన విషయమో నీకు బాగా తెలుసు. ఓ అల్లాహ్! నీవు ఈ యుద్ధాన్ని చివరి దశకు చేరుస్తున్నావని అనుకుంటున్నాను. ఖురైషులతో ఇంకా యుద్ధం కొనసాగించవలసి వస్తే నన్ను వారి కొరకు సజీవంగా ఉంచు. నేను నీ మార్గంలో వారితో జిహాద్ చేస్తాను. ఒకవేళ నీవే ఈ యుద్ధాన్ని ఇంతటితో ముగించదలిస్తే మాత్రం నాకు కలిగిన ఈ గాయాన్ని మానకుండా అలానే ఉంచు. ఈ గాయంతోనే నన్ను మరణించేటట్లు చెయ్యి."[15]

ఆయన వేడుకోలులోని చివరి వాక్యం ఇలా ఉంది: "(కాని), బనూ ఖురైజా వ్యవహారంలో నా కళ్ళు చల్లబడే వరకు నాకు మరణాన్ని ఇవ్వవద్దు."[16]

మొత్తానికి ఓ వైపు ముస్లిములు యుద్ధరంగంలో ఈ కష్టాలను ఎదుర్కొంటూ ఉంటే మరొక వైపు కుట్రలు, కుతంత్రాలను పన్నే యూదులు తమ పనిలో తాము నిమగ్నమై ఉన్నారు. ముస్లిములను ఎలా మట్టుపెట్టాలనే ప్లానులు వేస్తున్నారు. బనూ నజీర్ తెగకు చెందిన దుష్ట సర్దారు హుయ్ బిన్

15. సహీ బుఖారి-2/591 16. ఇబ్నె హిష్షామ్-2/227

https://teluguislam.net



అఖ్తబ్, బనూ ఖురైజా దర్బారుకు వచ్చి వారి నాయకుడు కఅబ్ బిన్ అసద్ ఖర్జీని కలిశాడు. ఈ కఅబ్ బిన్ అసద్ ఖర్జీ బనూ ఖురైజా తరఫున నిర్ణయాలు తీసుకోడానికి అర్హత పొందిన వ్యక్తి. ఇతనే దైవప్రవక్త (స)తో క్రితం యుద్ధ సమయంలో ఆయనకు సహాయపడతానని వాగ్దానం చేసి ఉన్న వ్యక్తి. ఈ విషయం మనం వెనుకటి పుటల్లో చదువుకున్నదే. హుయ్ వచ్చి అతని ఇంటి తలుపు తట్టాడు. అతను లోన్నుండి గడియ వేసుకొని కూర్చున్నాడు. కాని హుయ్, అతనితో చెప్పిన కల్లబొల్లి మాటలకు తలుపు తీయక తప్పలేదు. హుయ్ అతనితో, "ఓ కఅబ్! నేను నీ దగ్గరకు గౌరవాన్ని, సేనావాహినిని తీసుకువచ్చాను. ఖురైష్ సర్దారుల్ని, నాయకులందరిని తీసుకొని వచ్చి మజ్మ ఉల్ అస్యాల్ అనే ప్రదేశంలో ఉంచాను. ఇదే కాదు, బనూ గత్ఫాన్ తెగను వారి సర్దారులతో సహా పిలుచుకు వచ్చి ఉహద్ కొండ దాపున 'జన్బె నఖమీ'లో విడిది చేయించాను. వారంతా నాతో, "ముహమ్మద్ మరియు అతని అనుచరులను తుడిచేసే వరకు ఇక్కడి నుండి కదలం అని ప్రతిజ్ఞ కూడా చేసి ఉన్నారు" అని అన్నాడు.

ఈ మాటలు విన్న కఅబ్, "దైవసాక్షి! నీవు నా వద్దకు ప్రపంచంలోని అగౌరవాన్నంతా వెంటపెట్టుకొచ్చావు. అది వర్షించి ఖాళీ అయిన మేఘం తప్ప అందులో ఏ పసా లేదు. అది కేవలం ఉరుములు మెరుపుల మట్టుకే పరిమితమై ఉంది. ఓ హుయ్! నన్ను నా మానాన వదిలిపెట్టేసెయ్యి, నేను ముహమ్మద్ (స)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగపర్చను. ఆయనకు విద్రోహం తలపెట్టేది లేదు" అని నిక్కచ్చిగా చెప్పేశాడు.

కాని హుయ్ మాత్రం అంతటితో వదలకుండా బహువిధాల నచ్చ జెబుతూ ఉన్నాడు. చివరికి అతణ్ణి ఒప్పించి తీరాడు. అయితే హుయ్ బిన్ అఖ్తబ్‌కు ఓ షరతును ఒప్పుకోవలసివచ్చింది. దాని ప్రకారం, వారు ముహమ్మద్ (స)ను అంతమొందించకుండా వెళ్ళవలసి వస్తే మాత్రం తాను కూడా కఅబ్‌తో పాటే అతని కోటలో ప్రవేశిస్తాను అని, వారికి పట్టే గతిని తాను కూడా అనుభవిస్తానని మాటిచ్చాడు. హుయ్ చేసిన ఈ ప్రతిజ్ఞకు కఅబ్ దైవప్రవక్త (స)తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని త్రుంచివేశాడు. ఆ ఒప్పందం ప్రకారం, ముస్లిముల ఎడల గల బాధ్యతలన్నీ వదిలేసుకున్నాడు. దానికి

17. ఇబ్నె హష్షామ్-2/220, 221

https://teluguislam.net



భిన్నంగా ముష్రిక్కుల వైపు నుండి యుద్ధంలో పాల్గొనడానికే నిశ్చయించుకున్నాడు.[17]

హుయ్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం, బనీ ఖురైజా తెగకు చెందిన యూదులు యుద్ధ కార్యకలాపాల్లో నిమగ్నమైపోయారు. ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, హజ్రత్ సఫియ్యా బిన్తె అబ్దుల్ ముత్తలిబ్ (ర), హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ (ర)తో 'ఫారే' పేరుగల కోటలో ఉన్నారు. హజ్రత్ హస్సాన్(ర)కు స్త్రీలను, పిల్లలను కాపాడే బాధ్యత అప్పగించబడి ఉంది. హజ్రత్ సఫియ్యా (ర)గారు ఓ రోజు జరిగిన సంఘటనను ఇలా వివరిస్తున్నారు.

"ఓ యూదుడు మేము ఉన్న కోట చుట్టూ తిరుగుతూ కోట లోపలి పరిస్థితులను తెలుసుకోడానికి చక్కర్లు కొడుతున్నాడు. బనూ ఖురైజా దైవప్రవక్త (స)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగపరిచి యుద్ధానికి సన్నద్ధమవుతున్న సమయమది. బనూ ఖురైజా నుండి రక్షించడానికి మా వద్ద ఏ పురుషుడూ లేడు. దైవప్రవక్త (స) ముస్లిములందరితో సహా శత్రువును ఎదుర్కోడానికి కందకం ఈవల పొంచివున్న సమయమది. ఎవరైనా మాపై దాడి చేస్తే ఆయన వారిని వదిలి మమ్మల్ని రక్షించడానికి రాలేని పరిస్థితి అది. అందుకని నేను హజ్రత్ హస్సాన్ (ర)తో, "చూడండి! ఈ యూదుడు వచ్చి మనం ఉన్న కోట చుట్టూ తిరుగుతున్నాడు. దైవసాక్షిగా చెబుతున్నాను, ఇతను యూదులకు మన బలహీనతల గురించి చెప్పి మనపై దాడి చేయడానికి పురికొల్పవచ్చు. అటు దైవప్రవక్త (స) సహాబా (ర)తో సహా యుద్ధంలో చిక్కుకొని ఉన్నారు. ఆయన మన సహాయానికి రాలేరు. కాబట్టి వెళ్ళి అతణ్ణి సంహరించండి" అన్నాను. దానికి హజ్రత్ హస్సాన్ (ర), "దైవసాక్షిగా! నేను అలాంటి పనికి ఉపయోగపడే వ్యక్తిని కానని మీకు తెలియదా?" అన్నారు. అప్పుడు నేనే స్వయంగా నడుము బిగించి గుడారానికి కట్టి ఉన్న ఓ గడను ఊడదీశాను. కోట దిగి అతని వద్దకు వెళ్ళి ఆ గడతో అతని తలపై ఓ గట్టి దెబ్బ వేశాను. అతను ఆ దెబ్బకు చనిపోయాడు. తిరిగి వచ్చి హజ్రత్ హస్సాన్(ర)తో, "వెళ్ళి అతని ఆయుధాలు, అతని బట్టలు ఒలుచుకు రండి, అతను పురుషుడు కాబట్టి నేను అతణ్ణి తాకలేను" అని అన్నాను. దానికి ఆయన

18. ఇబ్నె హష్షామ్-2/228

https://teluguislam.net



నాతో, "నేనక్కడికి వెళ్ళలేను. అతని ఆయుధాలతో నాకు పని కూడా లేదు" అని అన్నారు.[18]

యదార్థం ఏమిటంటే, ముస్లిమ్ మహిళలు మరియు పిల్లల సంరక్షణ కోసం, మహాప్రవక్త (స)గారి మేనత్త హజ్రత్ సఫియ్యా (ర) నిర్వహించిన ఈ ఘనకార్యం యూదులపై పెద్ద ప్రభావాన్నే చూపించింది. బహుశా యూదులు, ఆ కోటలో మరింత మంది ముస్లిమ్ యోధుల పటాలం ఉందని అనుకోవడమే- అయితే అక్కడ ముస్లిమ్ యోధుల పటాలం ఏదీ లేదు- అందుకని యూదులు తిరిగి కోటలోనికి వెళ్ళే ధైర్యం ఏ మాత్రం చేయలేదు. కాని వారు విగ్రహారాధకుల సైన్యానికి సహాయపడుతున్నామని చూపడానికి వారికి నిరంతరం ఆహారాన్ని సరఫరా చేస్తూనే ఉన్నారు. ఆ ఆహారాన్ని మోసుకొని వెళ్ళే ఇరవై ఒంటెలను సైతం ముస్లిములు పట్టుకోవడం జరిగింది.

యూదుల ఈ వాగ్దానభంగానికి సంబంధించిన ఈ వార్త దైవప్రవక్త (స)కు అందగానే ఆయన (స), నిజానిజాలను తెలుసుకునేందుకు దృష్టిని మళ్ళించారు. బనూ ఖురైజా వైఖరి ఏమిటో తెలిసిపోతే దానికి అనుగుణంగా యుద్ధవ్యూహం దృష్ట్యా ఏ అవసరమైన చర్య తీసుకోవాలో ఆలోచించవచ్చు. దాని కోసం ఆయన(స), హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర), సఅద్ బిన్ ఉబాదా బిన్ రవాహా (ర) మరియు ఖవాత్ బిన్ జుబైర్ (ర)లను పంపిస్తూ, "చూడండి! బనీ ఖురైజా గురించి ఏ వార్త అయితే అందిందో అది ఎంత మట్టుకు సరి యైనది? అదే గనక నిజమైతే తిరిగి వచ్చి, ముస్లిముల ధైర్యానికి దెబ్బ తగల కుండా అది నాకొక్కడికే తెలియజేయండి. అది కూడా సంజ్ఞల రూపంలోనే సుమా! అలా కాకుండా, బనూ ఖురైజా తమ ప్రతిజ్ఞపై నిలకడగా ఉంటే మాత్రం ఆ వివరాలను అందరికీ తెలిసేటట్లు ప్రకటించండి" అని తాకీదు చేశారు. వీరు బనూ ఖురైజా యూదుల దగ్గరకు వెళ్ళగా వారు తలబిరుసుగా ప్రవర్తిస్తున్నట్లు గమనించారు. అంతేకాదు, ఆ యూదులు బాహాటంగా దుర్భాషలకు దిగి తమ శత్రుత్వాన్ని చాటుకున్నారు. దైవప్రవక్త (స)ను అగౌరవ పరిచే మాటలన్నారు.

"అల్లాహ్ ప్రవక్తనా? ఆయన ఎవరూ? మాకూ, ముహమ్మద్‌కు నడుమ ఎలాంటి ప్రమాణం జరగలేదు. ఎలాంటి వాగ్దానమూ లేదు" అని తిరస్క

https://teluguislam.net



రించారు. పోయినవారు తిరిగి వచ్చి దైవప్రవక్త (స)కు పరిస్థితినంతా సైగలతో విన్నవిస్తూ, కేవలం 'అజ్ల్ మరియు ఖారా' అనే పదాలను మాత్రమే పలికారు. అంటే అజ్ల్ మరియు ఖారాలు ఎలాగైతే రజీ సహాబీలను మోసగించారో, ఈ యూదులు కూడా అలాగే తమ వాగ్దానాన్ని భంగపరిచారని చెప్పడం అన్నమాట.

పోయివచ్చిన ఈ సహాబా (ర)లు యదార్థాన్ని దాయడానికి ఎంత ప్రయత్నం చేసినా, సామాన్య ప్రజలకు పరిస్థితి ఏమిటో అర్థమైపోయింది. ఇలా ఓ భయంకర ప్రమాదం వారి ముందుకొచ్చి నిలబడినట్లయింది.

యదార్థంగా, అప్పుడు ముస్లిములు కీలకమైన, సున్నితమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణమది. వెనుక వైపు బనూ ఖురైజా యూదులు, వారి దాడిని అడ్డుకోవడానికి, వారికీ ముస్లిములకు నడుమ మరెవ్వరూ అడ్డుగా లేరు. ముందు చూస్తే ముష్రిక్కుల విశాలమైన సేనావాహిని. వారిని వదిలి వెనక్కు పోవడానికీ వీల్లేదు. అటు ముస్లిమ్ స్త్రీలు, పిల్లలు ఎలాంటి సంరక్షణ లేకుండా ఒప్పందాన్ని త్రెంచేసిన యూదులకు దాపునే ఉన్నారు. ఈ పరిస్థితిలో ముస్లిములలో భయం అలుముకుంది. ఈ పరిస్థితినే దివ్యఖుర్ఆన్ ఇలా వివరిస్తోంది.

وَإِذْ زَاغَتِ الْأَبْصَارُ وَبَلَغَتِ الْقُلُوبُ الْحَنَاجِرَ وَتَظُنُّونَ بِاللَّهِ
الظُّنُونَا ﴿١٠﴾ هُنَالِكَ ابْتُلِيَ الْمُؤْمِنُونَ وَزُلْزِلُوا زِلْزَالًا شَدِيدًا ﴿١١﴾

**"శత్రువులు మీ మీదకు పై నుండి, క్రింది నుండీ దండెత్తి వచ్చినప్పుడు, భయం వల్ల మీ కళ్ళు తేలగిల్లినప్పుడు మీ గుండెకాయలు గొంతులోనికి వచ్చినప్పుడు, మీరు అల్లాహ్‌ను గురించి రకరకాలుగా అనుమానించారు. ఆ సమయంలో విశ్వాసులు కఠిన పరీక్షకు గురి అయ్యారు, తీవ్రంగా ఊపివేయబడ్డారు." (33 : 10,11)**

అదే సమయంలో కొందరు మునాఫిక్‌లు (కపట ముస్లిములు) కూడా బయటకు వచ్చి, ముహమ్మద్ మాతో, "మేము కైసరు మరియు కిస్రాల బొక్కసాలను సొంతం చేసుకుంటామని వాగ్దానం చేశాడు. మరిప్పుడు మేము కాలకృత్యాలు తీర్చుకోడానికి అయినా బయటకు వెళ్ళే అవకాశం లేదు" అని అనజొచ్చారు. కొందరు వంచకులైతే తమ జాతి గౌరవనీయులతో, "మా

https://teluguislam.net



ఇళ్ళు శత్రువుల కోసం తెరువబడి ఉన్నాయి. మాకు అనుమతినివ్వండి వెళ్ళి వాటిని రక్షించుకుంటాం, మా ఇళ్ళు నగరానికి చాలా ఎడం" అని కూడా అనసాగారు. బనూ సల్మా తెగ పూర్తిగా ధైర్యాన్ని వదిలేసి పారిపోవాలని కూడా ఆలోచించనారంభించింది. ఆ మునాఫిక్‌ల గురించే దివ్యఖుర్‌ఆన్ ఇలా సెలవిచ్చింది:

وَإِذْ يَقُولُ الْمُنَافِقُونَ وَالَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ مَّا وَعَدَنَا اللَّهُ وَرَسُولُهُ إِلَّا غُرُورًا ۝
وَإِذْ قَالَت طَّائِفَةٌ مِّنْهُمْ يَا أَهْلَ يَثْرِبَ لَا مُقَامَ لَكُمْ فَارْجِعُوا ۚ وَيَسْتَأْذِنُ فَرِيقٌ
مِّنْهُمُ النَّبِيَّ يَقُولُونَ إِنَّ بُيُوتَنَا عَوْرَةٌ ۛ وَمَا هِيَ بِعَوْرَةٍ ۖ إِن يُرِيدُونَ إِلَّا فِرَارًا ۝

**"కపటులూ, రోగగ్రస్త హృదయులూ అందరూ, "అల్లాహ్, ఆయన ప్రవక్త (స) మనతో చేసిన వాగ్దానాలన్నీ భ్రమలు తప్ప మరేమీ కావు" అని స్పష్టంగా ప్రకటించినప్పటి సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు వారి లోని ఒక వర్గం, "ఓ యస్‌రిబ్ ప్రజలారా! ఇక మీకు ఇక్కడ ఉండే అవకాశమేదీ లేదు, వెనక్కి వెళ్ళిపోండి" అని అన్నది. అప్పుడు వారిలోని మరొక వర్గం "మా గృహాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి" అని దైవ ప్రవక్తకు చెప్పి సెలవు కోరింది. వాస్తవానికి వాటికి ఏ ప్రమాదమూలేదు. అసలు వారు (యుద్ధ మైదానంనుండి) పారిపోదలిచారు." (33:12,13)**

ఓ వైపు ఇస్లామీయ సేనలో అలుముకున్న పరిస్థితి ఇది. మరొక వంక దైవప్రవక్త (స), బనూ ఖురైజా తలపెట్టిన ద్రోహానికి తన తలను ముఖాన్ని గుడ్డతో కప్పుకున్నారు. అలానే చాలా సేపటి వరకు వెల్లకిలా పడుకుని ఉన్నారు. మహాప్రవక్త (స)గారి ఈ పరిస్థితిని చూసి ముస్లిముల్లో భయభీతులు చోటుచేసుకున్నాయి. అయితే ఆ తరువాత ఆయనకు స్థిమితం చేకూరింది. ఆయనలో క్రొత్త ఆశలు పొడసూపాయి. దైవప్రవక్త (స) తమ నిస్సహాయ స్థితి నుండి అల్లాహు అక్బర్ అంటూ లేచి నిలబడ్డారు. ముస్లిములనుద్దేశించి, "ముస్లిములారా వినండి! అల్లాహ్ తరపున సహాయం మరియు విజయ శుభవార్త వచ్చింది" అన్నారు. ఆ పిదప ఆయన పరిస్థితులను అడ్డుకునే పథకం తయారు చేశారు. ఈ పథకంలోని ఓ భాగంగా, ముస్లిములు ఏమరుపాటులో ఉన్నప్పుడు యూదులు స్త్రీలు మరియు పిల్లలపై హఠాత్తుగా విరుచుకుపడకుండా, మదీనాను సంరక్షించడానికిగాను ముస్లిం యోధుల

https://teluguislam.net



ఓ దళాన్ని అక్కడికి పంపించారు. అయితే ఈ సందర్భంగానే ఆయన మరో వ్యూహం పన్నుతూ, శత్రువులకు చెందిన వివిధ వర్గాలను ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా చేసేందుకు ఓ నిర్ణయానికి రావలసి వచ్చింది. ఈ లక్ష్య సాధన కోసం ఆయన(స), బనూ గత్ఫాన్‌కు చెందిన ఇద్దరు సర్దారులు ఉయైనా బిన్ హసన్ మరియు హారిస్ బిన్ ఔఫ్‌తో ఓ ఒప్పందం కుదుర్చుకో దలిచారు. దాని ప్రకారం, మదీనావాసులు పండించే పంటలో మూడింట ఒక వంతును వారికి ముట్టచెప్పడం బదులుగా ఆ ఇద్దరు సర్దారులు తమ తమ తెగలను తీసుకొని యుద్ధం నుండి వెళ్ళిపోవడం, ఈ వ్యూహరచన ద్వారా ముస్లిములు ఖురైషులను మార్కొని వారిని ఓడించ వచ్చని భావిం చారు. ఈ సలహా గురించి సహాబాల మధ్య చర్చ కూడా జరిగింది. కాని దైవప్రవక్త(స) ఈ వ్యూహాన్ని హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్(ర) మరియు హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర)ల ముందుపెట్టగా వారు ఇద్దరు ఏక కంఠంగా, "దైవప్రవక్తా (స)! ఒకవేళ అల్లాహ్‌యే ఇలా చేయమని ఆదేశిస్తే మేము దీన్ని మారుమాట్లాడకుండా శిరసావహిస్తాం. ఒకవేళ తమరు మా కోసమని అలా చేస్తున్నారు అనుకుంటే మాత్రం, ఈ ఒప్పందం మాకు ససేమిరా శిరోధార్యం కాదు. మేమూ, వారూ ఉభయులం బహుదైవారాధకు లుగా ఉన్నప్పుడు, వారు మా అతిథి సత్కారం లేదా క్రయవిక్రయాలు తప్ప ఓ గింజ కూడా పొందలేకపోయినవారు. ఇప్పుడు, అల్లాహ్ మాకు ఇస్లామ్ అనే రుజుమార్గాన్ని ప్రసాదించి, తమ ద్వారా మాకు గౌరవం కలిగించాక ఇక మేము వారికి మా ధనసంపదలను ఎలా ఇస్తాము? దైవసాక్షి! మేమైతే వారికి కేవలం మా కరవాలాలను మాత్రమే అందించగలం" అని సమాధాన మిచ్చారు. దైవప్రవక్త (స) వీరి సలహాలను విని, "మీ సలహాలు అంగీకరించ దగినవే, పూర్తి అరేబియాయే ఏకమై మీపై విరుచుకుపడడం చూసి మీ మేలు కోరే నేను ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది, అంతకంటే మరేమీ కాదు" అని అన్నారు.

దైవలీల ఏమిటోగాని శత్రు సేనలోనే చీలిక ఏర్పడింది. ఆ తరువాత వారు ఓటమికి గురి అయిపోయారు. అది ఎలా సాధ్యం అయిందో ఆ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

బనూ గత్ఫాన్‌కు చెందిన ఓ వ్యక్తి 'నుఅయిమ్ బిన్ మస్‌ఊద్ బిన్

https://teluguislam.net



అమిర్ అష్జయీ' మహాప్రవక్త (స) సన్నిధికి రావడం జరిగింది. ఆయన దైవప్రవక్త (స)తో ఇలా విన్నవించుకున్నారు.

"ఓ దైవప్రవక్తా! నేను ఇస్లామ్ స్వీకరించాను. కాని ఈ విషయం నా జాతికి ఇప్పటి వరకూ తెలియదు. తమరు నాకు ఏదైనా ఆదేశం ఇవ్వండి దాన్ని పాలించడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నారు.

"నీవు కేవలం ఒంటరివాడివి. (ఆ సైన్యంతో యుద్ధం చేయలేవు) అయితే సాధ్యమైనంతమట్టుకు శత్రు శిబిరంలో చీలిక తెచ్చి వారి ధైర్యాన్ని పోగొట్టు, యుద్ధం అంటేనే కుయుక్తులకు మారుపేరు మరి" అని సలహా ఇచ్చారు. ఇది విన్న హజ్రత్ నుఅయిమ్ (ర) వెంటనే బనూ ఖురైజా యూదుల వద్దకు వెళ్ళారు. ఇస్లామ్ స్వీకరించక పూర్వం ఆయన వారితో ఎంతో కలుపుగోలుగా ఉంటూ వచ్చినవారు. అక్కడకు వెళ్ళి, "మీ ఎడల నాకు ఎంత ప్రేమ ఉందో, నాకూ మీకూ నడుమగల ప్రత్యేక సంబంధం ఎలాంటిదో మీరు ఎరిగిన విషయమే కదా!" అని పలికారు.

"అవును, ఇందులో సందేహమేముంది?" అన్నారు వారు.

"అయితే వినండి! ఖురైషుల వ్యవహారం మీకు భిన్నమైన వ్యవహారం. ఈ ప్రాంతం అంతా మనకు చెందిన ప్రాంతం. ఇక్కడ మీ ఇళ్ళూవాకిళ్ళూ ఉన్నాయి. మీ వ్యాపారం అంతా ఈ ప్రాంతానికి చెందిందే. మీ ధనసంపద, పిల్లాజెల్లా అంతా ఇక్కడే ఉంటున్నారు. మీరు వారిని వదిలి ఎక్కడికీ పోలేరు కూడా. అయితే ఖురైషులు మరియు గత్ఫానులు కలసి ముహమ్మద్ (స)తో యుద్ధం చేయడానికి వస్తే మీరు ముహమ్మద్‌కు వ్యతిరేకంగా వారికి సహాయ పడుతున్నారు. వారికి ఇక్కడ ఇళ్ళూ వాకిళ్ళుగానీ, భార్యాపిల్లలుగానీ, ధన సంపదలుగానీ ఏవీ లేవు. వారికి అవకాశం చిక్కితేనే ముహమ్మద్‌ను జయించ గలరు. లేని పక్షంలో తమ పెట్టేబేడా సర్దుకొని ఇంటి ముఖం పట్టేస్తారు. ఇక మిగిలేది మీరూ, ముహమ్మద్ (స) మాత్రమే. ఇప్పుడేం చేస్తారు చెప్పండి" అని భయపెట్టారు. ఈ మాటలు విన్న బనూ ఖురైజా యూదులకు గుండెలు దడదడలాడాయి.

"చెప్పండి నుఅయిమ్! మమ్మల్ని ఏమి చేయమంటారో" అని అడిగారు.

"ఏముందీ! ఖురైషులకు చెందిన కొంతమందిని మీ దగ్గర ఉంచు

https://teluguislam.net



కోండి. వారే గనక దానికి సిద్ధపడకపోతే యుద్ధంలో మీరు పాల్గొనకూడదు" అని సలహా ఇచ్చారు.

"ఓహో! ఎంత మంచి సలహా ఇది" అని ఆయన్ను పొగడనారంభించారు వారు.

ఆ తరువాత నుఅయిమ్ నేరుగా ఎవరికీ తెలియకుండా ఖురైషుల శిబిరానికి వెళ్ళారు. ఖురైషులను ఉద్దేశించి,

"మీరంటే నాకెంత ఇష్టమో, మీకు మేలు జరగాలని ఎంతగా ఆకాంక్షిస్తున్నానో ఆ విషయం మీకు తెలిసిందే" అన్నారు. దానికి ఖురైషులు, "అవును. అది మాకు బాగా తెలుసు. మీరు మా మేలు కోరేవారే" అన్నారు.

"అయితే వినండి! యూదులు ముహమ్మద్ (స)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగపరచి ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారు. ఇప్పుడు అందరూ కలసి ఓ నిర్ణయానికి వచ్చారు. అదేమిటంటే, వారు (ఆ యూదులు) మీ దగ్గర నుండి కొందరు మనుషుల్ని కుదువపెట్టుకొని ముహమ్మద్ (స)కు అప్పజెప్పి క్షమాపణ కోరుకుంటారట. తిరిగి ముహమ్మద్ (స)తో చేసిన ఒడంబడికను పునరుద్ధరిస్తారట. కాబట్టి ఆ యూదులే గనక మీ మనుషుల్ని కుదువపెట్టమని అడిగితే, జాగ్రత్త! ఒక్కరిని కూడా కుదువపెట్టవద్దు సుమా!" అని హితవు చేసి వెళ్ళిపోయారు.

అలాగే హజ్రత్ నుఅయిమ్ గత్ఫాన్ తెగ సర్దారుల వద్దకు వెళ్ళి ఆ మాటలనే రెట్టించారు. వారు కూడా జాగరూకులైపోయారు.

ఇది జరిగిన తరువాత శుక్రవారం మరియు శనివారం నాటి మధ్యరాత్రి ఖురైషులు, యూదుల వద్దకు, "మా విడిది అంత సరైన ప్రదేశంలో లేదు. అందువల్ల మా గుర్రాలు, ఒంటెలు చనిపోతున్నాయి. కాబట్టి అటు నుండి మీరు ఇటు నుండి మేము ముహమ్మద్ (స)పై వెంటనే దాడి చేయాలి" అని వర్తమానం పంపించారు. కాని యూదులు సమాధానంగా, "ఈ రోజు శనివారం, మీకు తెలుసు సబ్బత్ రోజున మేము ఏ పనీ చేయమనేది. గతంలో దైవ ఆదేశాన్ని ధిక్కరించిన వారు దైవశిక్షను ఎలా అనుభవించారో మాకు బాగా తెలుసు. అంతేకాదు మీరు మీ మనుషులు కొందర్ని మా వద్ద కుదువ బెట్టనంత వరకు మేము యుద్ధంలో పాల్గొనే ప్రసక్తే లేదు" అని చెప్పి పంపించారు.

https://teluguislam.net



వార్తాహరుడు తెచ్చిన ఈ వార్త వినగానే ఖురైషులు మరియు గత్ఫానులు, "దైవసాక్షి! నుఅయిమ్ నిజమే చెప్పాడు" అని యూదులకు, "మేము ఏ ఒక్కరినీ మీ దగ్గర కుదువపెట్టేవారం కాదు. మీరు త్వరగా మాతో సహకరించి (ఇరువైపుల నుండి) ముహమ్మద్ (స)పై దాడి చేయాల్సి ఉంది" మరో వర్తమానం పంపించారు. ఖురైష్ గత్ఫాన్‌ల ఈ వైఖరిని గమనించిన బనూ ఖురైజా యూదులు, "దైవసాక్షి! నుఅయిమ్ నిజమే చెప్పారు" అని అనుకున్నారు.

ఇలా రెండు వర్గాల్లో చీలిక ఏర్పడి పరస్పరం ఒకరిపై మరొకరికి ఉన్న నమ్మకం కాస్తా అడుగంటిపోయింది. వారి సైన్యంలో చీలిక ఏర్పడి, ధైర్యాలు సన్నగిల్లాయి.

ఈ సందర్భంలో ముస్లిములు అల్లాహ్‌ను ఇలా వేడుకుంటున్నారు:

"ఓ ప్రభూ! మా రహస్యాలను శత్రువుకు తెలియకుండా దాచి ఉంచు. మమ్మల్ని అన్ని రకాల ప్రమాదాల నుండి కాపాడు."

మహాప్రవక్త (స) దైవాన్ని ఇలా వేడుకుంటున్నారు:

"ఓ అల్లాహ్! గ్రంథాన్ని అవతరించినవాడా! కర్మల లెక్కల్ని త్వరగా తీసుకునే ఓ ప్రభూ! ఈ సైన్యాలకు ఓటమిని కలుగజెయ్యి. ఓ అల్లాహ్! వారిని ఓడించు, ఊపివెయ్యి."[19]

చివరికి అల్లాహ్ ముస్లిముల వేడుకోలును విన్నాడు. ముష్రిక్కులలో చీలిక ఏర్పడి వారు భయభీతులు అయిపోయిన తరువాత అల్లాహ్ వారిపై భీకరమైన తుఫానును పంపాడు. ఆ తుఫాను గాలులు వారి గుడారాల్ని పీకి వేశాయి. పొయ్యిల్లో ఉన్న వంట పాత్రలు డొల్లిపోయాయి. ఏ వస్తువూ స్థిరంగా ఉండలేదు. దానికితోడు దైవదూతల సేనను కూడా పంపించాడు అల్లాహ్. ఈ సేన వారందరినీ కుదిపివేసింది. వారి హృదయాల్లో భయభీతుల్నీ, ముస్లిములంటే జంకునూ సృష్టించాడు.

ఈ ఎముకలు కొరికి వేసే శీతల రాత్రి వేళనే దైవప్రవక్త (స), దైవధిక్కారుల పరిస్థితి ఎలాగుందో తెలుసుకురమ్మని హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (ర)ను పంపించారు. ఆయన యుద్ధరంగంలోనికి వెళ్ళి చూడగా అక్కడ పరిస్థితి అంతా అస్తవ్యస్తంగా ఉంది. ముష్రిక్కులు తిరుగు ప్రయాణానికి

*19. సహీ బుఖారి, కితాబుల్ జిహాద్-1/411; కితాబుల్ ముగాజీ-2/590*

https://teluguislam.net



సంసిద్ధులవుతున్నారు. తిరిగి వచ్చి ఆ పరిస్థితి గురించి మహాప్రవక్త (స)కు తెలియజేశారు ఆయన. తెల్లవారిన తరువాత చూడగా (యుద్ధరంగం అంతా ఖాళీ అయిపోయింది) అల్లాహ్ శత్రువును ఎలాంటి ప్రయోజనం పొందకుండా ఆ కోపంలోనే వెనక్కు పంపించడం అగుపడింది దైవప్రవక్త (స)కు. మొత్తానికి అల్లాహ్ తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడు. తన సేనకు గౌరవాన్ని చేకూర్చాడు. తన దాసునికి సహాయపడుతూ ఆయన ఒక్కడే ఈ అపార సేనావాహినిని ఓడించాడు. ఆ తరువాత మహాప్రవక్త (స) మదీనాకు బయలుదేరి వెళ్ళి పోయారు.


అగడ్త యుద్ధం (గజ్వయె అహ్‌జాబ్) ప్రామాణికమైన ఉల్లేఖనం ద్వారా, షవ్వాల్ నెల హిజ్రీ శకం 5లో సంభవించింది. ముష్రిక్కులు ఒక నెల పాటు లేదా దాదాపుగా ఒక నెల వరకు దైవప్రవక్త (స)ను మరియు ముస్లిములను దిగ్బంధంలో ఉంచారు ఆ యుద్ధంలో. అన్ని ఆధారాలను పరిగణనలోనికి తీసుకుంటే, ఈ దిగ్బంధం షవ్వాల్ నెల ఆరంభం నుండి ప్రారంభమై జీఖాదా నెల వరకు కొనసాగిందని తెలుస్తోంది. ఇబ్నె సఅద్ ఉల్లేఖనం ప్రకారం, అహ్జాబ్ యుద్ధం నుండి తిరుగు ప్రయాణమైన రోజు బుధవారం. జీఖాదా మాసం పూర్తి కావడానికి ఇంకా ఏడు రోజులు మిగిలి ఉన్నాయి.

అహ్‌జాబ్ యుద్ధం వాస్తవానికి నష్టాల యుద్ధం అనే బదులు మానసిక మైన ఒత్తిడికి గురిచేసిన యుద్ధమే అని అనడం సబబు. ఈ యుద్ధంలో ఎలాంటి రక్తపాతం జరుగలేదు. అయినా ఇది ఇస్లామీయ చరిత్రకు సంబంధించిన నిర్ణయాత్మకమైన యుద్ధం. ఈ యుద్ధంలో ముష్రిక్కుల మనోబలం పూర్తిగా దెబ్బతిన్నది. అరేబియాకు చెందిన మరే శక్తి, మదీనాలో జీవం పోసుకుంటున్న ఈ చిన్న శక్తిని అంతమొందించజాలదు అనే విషయం తెలిసిపోయింది. ఎందుకంటే, అహ్‌జాబ్ యుద్ధంలో సమీకరించబడినంత సైనిక బలాన్ని తిరిగి సమకూర్చడం అరబ్బులకు సాధ్యం అయ్యే పని కాదు. అందుకని దైవప్రవక్త (స) అహ్‌జాబ్ యుద్ధం నుండి తిరిగివచ్చిన తరువాత ఇలా సెలవిచ్చారు:

"ఇక మనమే వారిపై దండెత్తి వెళ్ళవలసి ఉంది. వారు ఇక మనపై దండెత్తి రాలేరు. మన సేనయే వారి వైపునకు వెడుతుంది" అని ప్రకటించారు.

https://teluguislam.net





https://teluguislam.net



# గజ్వయె బనూ ఖురైజా

అహ్‌జాబ్ యుద్ధం నుండి తిరిగివచ్చిన రోజునే దైవప్రవక్త (స), ఉమ్మె సల్మా (ర)గారి ఇంట్లో స్నానం చేస్తూ ఉండగా హజ్రత్ జిబ్రీల్ (అ.స.) ఆయన (స) వద్దకు వచ్చి, "ఏమిటీ! మీరు అప్పుడే ఆయుధాలను పడవేశారా? ఇంకా దైవదూతలు తమ ఆయుధాలను పడవేయలేదే? నేను కూడా ఆ జాతిని వెంటాడి ఇప్పుడే మీ దగ్గరకు వచ్చాను. లేవండి! తమ సహచరు లందరినీ తీసుకొని బనూ ఖురైజా వైపునకు బయలుదేరండి. నేను ముందు అక్కడికి వెళ్ళి వారి కోటల్ని కంపనానికి గురిచేస్తాను. వారి హృదయాల్లో భయాందోళనలను రేకెత్తిస్తాను" అని చెప్పి దైవదూతల్ని వెంటబెట్టుకొని అక్కడికి వెళ్ళిపోయారు.

ఇటు మహాప్రవక్త (స) ఓ సహాబీ (ర)తో, "ఎవరైతే విధేయతపై నిలకడగా ఉన్నారో వారంతా అస్ర్ నమాజును బనూ ఖురైజా ఉంటున్న చోటుకు వెళ్ళి చేయాలి" అని ప్రకటన చేయించారు. ఆ తరువాత ఆయన (స) మదీనాను కాపాడే బాధ్యతలను ఉమ్మె మక్తూమ్ (ర)గారికి అప్పగించారు. హజ్రత్ అలీ (ర)గారి చేతికి యుద్ధపతాకాన్ని ఇచ్చి వెంట సైన్యం ఇచ్చి బయలుదేరదీశారు. హజ్రత్ అలీ (ర) తన సహచరులతో బనూ ఖురైజా కోటల దగ్గరికి వెళ్ళగానే ఆ యూదులు దైవప్రవక్త (స)ను తిట్టడం మొదలెట్టారు.

ఇంతలోనే మహాప్రవక్త (స) కూడా ముహాజిర్లు మరియు అన్సారుల సంరక్షణలో బయలుదేరడం జరిగింది. బనూ ఖురైజా ఉంటున్న ప్రదేశానికి దగ్గరలో ఉన్న 'అనా' అనే ఓ బావి వద్ద విడిది చేశారు. సాధారణ ముస్లిములు కూడా ఆ ప్రకటన వినడంతోనే బనీ ఖురైజా ఉండే చోటుకు తరలివెళ్ళ నారంభించారు. మార్గం మధ్యలో అస్ర్ నమాజు వేళ అయిపోయింది. కొందరు "మనకు ఏ ఆదేశం అయితే ఇవ్వబడిందో దాని ప్రకారం బనూ ఖురైజా వద్దకు వెళ్ళే అస్ర్ నమాజ్ చేద్దాం" అని అన్నారు. ఇలా వారు అస్ర్

https://teluguislam.net



నమాజును అక్కడికి చేరిన తరువాత ఇషా నమాజు అయిన తరువాత చేసుకున్నారు. మరికొందరు సహాబా(ర)లు, "అలా కాదు! దైవప్రవక్త (స) గారి ఉద్దేశ్యం కేవలం, మనం వెంటనే బయలుదేరి వెళ్ళాలి అన్నదే" అని మార్గం మధ్యలోనే అస్ర్ నమాజు చేసుకున్నారు. అయితే ఈ విషయం దైవప్రవక్త (స)కు తెలిసి నప్పుడు ఆయన ఎవ్వరినీ మందలించలేదు.

ఎలాగైతేనేమీ, వివిధ వర్గాలుగా ఇస్లామీయ సేన బనూ ఖురైజా నివసిస్తున్న ప్రదేశానికి వచ్చి చేరుకుని మహాప్రవక్త (స)ను కలుసుకోవడం జరిగింది. వీరంతా కలసి బనూ ఖురైజా కోటలను చుట్టుముట్టారు. ఈ సైన్యం సంఖ్య మొత్తం మూడు వేలు. ఇందులో ముప్పై గుర్రాలు కూడా ఉన్నాయి.

దిగ్బంధం మరీ తీవ్రమైన తరువాత యూదుల సర్దారు కఅబ్ యూదుల ముందు మూడు ప్రత్యామ్నాయ మార్గాలను ఉంచాడు:

1. ఇస్లామ్ స్వీకరించి ముహమ్మద్ (స) ధర్మంలో చేరిపోయి తమ భార్యా పిల్లల్ని, ధనసంపదలను రక్షించుకోవడం. కఅబ్ ఈ ప్రతిపాదన చేస్తూ, "దైవసాక్షి! మీకు బాగా తెలుసు. ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త అన్న విషయం. మన గ్రంథాల్లో చెప్పబడిన వ్యక్తే ఆయన" అని కూడా అనడం జరిగింది.

2. లేదా, మన భార్యాబిడ్డల్ని స్వయంగా మన చేతుల మీదుగా హతమార్చి కరవాలంబట్టి ప్రవక్త (స) వైపునకు వెళ్ళి పూర్తి శక్తినుపయోగించి ఆయనను ఢీకొనడం. ఆ తరువాత విజయమో లేదా మనమందరం చంపబడడమో జరుగుతుంది.

3. లేదా, ముహమ్మద్(స)పై శనివారం రోజున ఏమరుపాటుగా ఉన్నప్పుడు విరుచుకుపడడం. శనివారం మనం యుద్ధం చేయమని వారికి గట్టి నమ్మకం కూడా.

కాని యూదులు ఈ మూడు ప్రతిపాదనల్లో ఏ ఒక్కదాన్నీ ఒప్పుకోలేదు. ఇది చూసిన వారి సర్దారు వారినుద్దేశించి, "మీరు మీ తల్లి గర్భం నుండి జన్మించినప్పటి నుండి ఒక్క రాత్రి కూడా వివేకంతో గడిపినట్లు లేదు" అని తిట్టాడు.

https://teluguislam.net



ఈ మూడు ప్రతిపాదనలను రద్దుపరిచిన తరువాత బనూ ఖురైజా ముందు కేవలం ఒకే ఒక మార్గం మిగిలిపోయింది. అది, దైవప్రవక్త (స)కు లొంగిపోయి, తమ ఆయుధాలను పడవేయడం. తమ అదృష్టాన్ని ఆయన చేతిలో ఉంచి ఆయన తీర్పు కోసం ఎదురుచూడడం. అయితే యూదులు తమ ఆయుధాలను పడవేసి లొంగిపోయే ముందు తమ మిత్రపక్షాలైన ముస్లిములతో కూడా సంప్రతించాలని అనుకున్నారు. బహుశా ఆయుధాలు పడవేసిన తరువాత వారికి పట్టబోయే గతి ఎలాంటిదో తెలుసుకునే ఉద్దేశ్యంతో. యూదులు ఇలా అనుకొని దైవప్రవక్త (స) వద్దకు ఓ దూతను పంపిస్తూ, "అబూ లుబాబా (ర)ను మా వద్దకు పంపించండి. ఆయన్ను మేము సలహా అడగాలనుకుంటున్నాం" అని చెప్పి పంపారు. అబూ లుబాబా (ర) వారికి మిత్రపక్షం వారు. ఆయన తోటలు, వారి కుటుంబాలు కూడా ఆ ప్రదేశంలోనే ఉన్నాయి. హజ్రత్ అబూ లుబాబా (ర) వారి దగ్గరకు వెళ్ళగానే పురుషులందరూ ఆయన వైపునకు పరుగుపరుగున వచ్చి చేరారు. స్త్రీలు, పిల్లలు ఆయన ఎదురుగా నిలబడి శోకాలు తీస్తూ ఏడ్పులంకించుకున్నారు. ఈ పరిస్థితిని చూసి అబూ లుబాబా (ర) మనస్సు చలించింది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. యూదులు ఆయనతో, "అబూ లుబాబా (ర)! మీరు చెప్పండి, మేము ముహమ్మద్ (స) చేసిన తీర్పుపై ఆయుధాలు పడవేయాల్సిం దేనా?" అని.

"అవును. ఆయుధాలు పడవేయాల్సిందే" అన్నారాయన. అలా అంటూనే తన చేతితో గొంతు వైపునకు సైగ కూడా చేశారు. అంటే, మీరం దరూ చంపబడతారు అని చెప్పడం అన్నమాట. కాని ఆయనకు వెంటనే స్పృహ వచ్చింది. ఇది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) ఎడల ద్రోహం అన్న విషయం వెంటనే గ్రహించారు. ఆయన దైవప్రవక్త (స) దగ్గరకు రాకుండా నేరుగా మస్జిదె నబవీకి వెళ్ళి అక్కడ తాను ఓ స్తంభానికి వేసి కట్టుకున్నారు. అలా కట్టుకున్నాక ఆయన, తనను కేవలం ఒక్క దైవప్రవక్త (స) మాత్రమే విప్పాలి అంటూ శపథం చేశారు. ఇటు దైవప్రవక్త (స) అబూ లుబాబా (ర) ఎంత వరకూ రాకపోవడం చూసి అడిగారు. ఆయన మస్జిద్‌లో ఓ స్తంభానికి వేసి కట్టుకున్నట్లు తెలిసి, "ఆయన కోసం నేను మన్నింపు దుఆ మాత్రం చేయగలను. అంతకంటే ఏమీ చేయలేను. ఆయన అంత పని చేసినప్పుడు

https://teluguislam.net



ఆయన్ను నా చేతుల మీదుగా విప్పివేయలేను కూడా. అల్లాహ్ ఆయన తౌబా (పశ్చాత్తాపాన్ని)ను స్వీకరిస్తే తప్ప" అన్నారు.

ఇటు అబూ లుబాబా (ర) చేసిన సైగను కూడా అర్థం చేసుకోకుండా బనూ ఖురైజా, దైవప్రవక్త (స)కు లొంగిపోయి అయుధాలు పడవేయడానికి, ఆయన తీర్పును శిరసావహించడానికి సిద్ధపడ్డారు. కాగా, బనూ ఖురైజా వారు ఓ సుదీర్ఘ కాలం వరకు ముస్లిముల దిగ్బంధాన్ని భరించే స్థితిలోనే ఉన్నారు. వారి వద్ద కావలసిన ఆహార పదార్థాలూ ఉన్నాయి. త్రాగడానికి నీటి చెలమలూ, బావులూ, ఉండడానికి దృఢమైన కోటలూ ఉన్నాయి. మరో వైపు ముస్లిములు ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా ఆకాశం క్రింద రక్తాన్ని గడ్డ కట్టించే చలిని భరిస్తూ ఉన్నారు. ఆకలి బాధ కూడా వారిని వెంటాడుతూనే ఉంది. అహ్జాబ్ యుద్ధం మొదలుకాక పూర్వం నుండే సతతం యుద్ధ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్న కారణంగా బాగా అలసిపోయి ఉన్నారు కూడా. అయితే ఈ యుద్ధం వారి మానసిక స్థితిని కూడా బాగా దెబ్బతీసింది. అల్లాహ్ బనూ ఖురైజా మనస్సుల్లో భయాందోళనలను రేకెత్తించడం వల్ల వారి ధైర్యం పూర్తిగా దెబ్బతిన్నది. అంతేకాదు, హజ్రత్ అలీ (ర) మరియు జుబైర్ బిన్ అవామ్ (ర)లు కలసి ముందుకు వచ్చి వారిని గదమాయించడం మొదలెట్టారు. హజ్రత్ అలి (ర) అయితే ముస్లిములను ఉద్దేశించి, "ఓ సైనికులారా! దైవసాక్షి! హజ్రత్ హమ్జా (ర) గారు అమరగతిపొందినట్లే నేనన్నా అమరగతిని పొందుతాను, లేదా వారి ఈ కోటను జయించనైనా జయిస్తాను" అన్నారు.

హజ్రత్ అలి (ర) గారి ఈ బహిరంగ ప్రకటన విన్నంతనే బనూ ఖురైజా యూదులు ఆలస్యం చేయకుండా తమను దైవప్రవక్త (స)కు సరండరు చేసుకొని, "ఓ ప్రవక్తా (స)! తమరు ఏ విధంగా తీర్పు ఇచ్చినా అది మాకు సమ్మతమే" అని అన్నారు. మహాప్రవక్త (స), పురుషుల చేతులను వెనక్కి విరిచి కట్టేయమని ఆదేశం ఇవ్వగా, ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర) గారి పర్యవేక్షణలో అందరి చేతులు కట్టివేయడం జరిగింది. స్త్రీలను, పిల్లలను వారి నుండి వేరు చేసి దూరంగా ఉంచారు. ఈ పరిస్థితిని చూసి అవస్ తెగకు చెందిన వారు దైవప్రవక్త (స)ను, "తమరు బనూ ఖైనుఖాతో ఏ విధంగా ప్రవర్తించారో వీరి ఎడల కూడా అదే విధంగా ప్రవర్తించండి. బనూ ఖైనుఖా

https://teluguislam.net



మా సోదరులైన ఖజ్రజ్‌కు మిత్రపక్షాలు, వీరు మాకు మిత్రపక్షాలు. కాబట్టి వీరిపై కరుణ, దయ చూపండి" అని ప్రాధేయపడ్డారు. ఇది విన్న దైవప్రవక్త (స) అవస్ తెగవారినుద్దేశించి, "మీ నుండే ఓ వ్యక్తి వీరి గురించి తీర్పు చెబుతాడు, దీనికి మీరు సిద్ధమేనా?" అని అడిగారు.

"అవును. అది మాకు సమ్మతమైన విషయమే" అన్నారు అవస్ తెగవారు.

"అయితే ఈ వ్యవహారాన్ని సఅద్ బిన్ ముఆజ్ (ర) గారికి అప్పజెబుతున్నాను" అన్నారు మహాప్రవక్త (స).

"మేము తమ ఈ తీర్పును సంతోషంగా స్వీకరిస్తున్నాం" అన్నారు వారు.

ఆ తరువాత మహాప్రవక్త (స) మదీనాలో ఉన్న హజ్రత్ సఅద్ (ర)ను పిలువనంపారు. ఆయనకు గాయం అయి ఉండడం వల్ల ఈ సైన్యంతో ఇక్కడికి రాలేని స్థితిలో ఉన్నారప్పుడు. అహ్జాబ్ యుద్ధంలో ఆయన చేతి ప్రధాన నరం ఒకటి తెగిపోయి ఉంది. ఆయన్ను కంచర గాడిదపై ఎక్కించుకొని దైవప్రవక్త (స) గారి సన్నిధికి తీసుకురావడం జరిగింది. ఆయన దగ్గరకు రాగానే, ఆయన తెగ అవస్ వారు అన్ని వైపుల నుండి ఆయన్ను చుట్టుముట్టారు.

"సఅద్! మీ మిత్రపక్షం అయిన బనూ ఖురైజా విషయంలో మేలు తలచి వారిపై దయ చూపండి. దైవప్రవక్త (స) మిమ్మల్ని, వారి ఎడల దయ జూపే ఉద్దేశ్యంతోనే మిమ్మల్ని న్యాయనిర్ణేతగా ఎన్నుకున్నారు" అని అన్నారు.

హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) ఏమీ మాట్లాడలేదు. ప్రజలు ఆయన్ను బలవంతం పెట్టడం చూసి, "ఇప్పుడు సమయం వచ్చేసింది. అల్లాహ్ విషయంలో మరెవ్వరు తూలనాడినా సఅద్ మాత్రం పట్టించుకునే సమయం కాదిది" అన్నారు.

ఇది విన్నంతనే కొందరు మదీనాకు వెళ్ళిపోయి ఖైదీలకు మరణదండన పడిందని ప్రకటించనే ప్రకటించేశారు.

హజ్రత్ సఅద్ (ర) దైవప్రవక్త (స) సన్నిధికి రాగానే ఆయన (స) ప్రజలతో, "లేవండి! మీ సర్దారును ఆహ్వానించడానికి లేవండి" అనగా వారంతా ఆయన్ను ఆ కంచర గాడిద మీద నుండి క్రిందికి దించారు.

https://teluguislam.net



"ఓ సఅద్! వీరంతా మీ తీర్పు కోసం సంసిద్ధులై ఉన్నారు" అన్నారు దైవప్రవక్త (స) ఆయన దగ్గరకు రాగా.

"అయితే నేను ఇచ్చే తీర్పు అమలు చేయబడుతుందా?" ప్రశ్నించారు ఆయన.

"ఔను. మీ తీర్పే శిరోధార్యం" అన్నారు అక్కడి వారంతా.

"ముస్లిములు కూడా దీన్ని శిరసావహిస్తారా?"

"ఔను, తప్పకుండా."

"మరి ఇక్కడ ఉన్నవారు కూడానా?" ఆయన ఉద్దేశ్యం దైవప్రవక్త (స) కూడానా? అని చెప్పడం అన్న మాట. కాని దైవప్రవక్త (స) గారి మూర్తిమత్వాన్ని గమనించిన ఆయన తన ముఖాన్ని మరో వైపు ఉంచి అడిగిన ప్రశ్న అది.

"ఔను. నాకు కూడా మీ తీర్పు శిరోధార్యం" అన్నారు దైవప్రవక్త (స) అది గమనించి.

"అయితే నా తీర్పు వినండి! వారి పురుషులందరిని హతమార్చండి. స్త్రీలను, పిల్లల్ని ఖైదీలుగా చేసుకోండి. వారి ధనాన్ని పంచేయండి" తీర్పు వినిపించారు హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర).

ఈ తీర్పును విన్న దైవప్రవక్త (స) -

"ఓ సఅద్! ఏడు ఆకాశాలపైన అల్లాహ్ చేసిన తీర్పే మీరిచ్చిన తీర్పు" అని పొగిడారు.

హజ్రత్ సఅద్ (ర) గారు ఇచ్చిన తీర్పు ఎంతో వివేకంతో, న్యాయ బద్ధంగా ఇచ్చిన తీర్పు. ఎందుకంటే, బనూ ఖురైజా యూదులు, ముస్లిములు చావు బ్రతుకులు అనుభవిస్తున్న తరుణంలోనే ఓ భయంకరమైన ద్రోహానికి తలపడ్డారు. అదేకాదు, వారు ముస్లిములను కడతేర్చడానికి రెండు వేల అయిదు వందల కరవాలాలు, రెండు వేల బల్లాలు, మూడు వందల కవచాలు మరియు అయిదు వందల ఢాలులను సమకూర్చుకొని ఉన్న సమయం అది. విజయం తరువాత వాటన్నిటిని ముస్లిములు హస్తగతం చేసుకోవడం జరిగింది.

ఈ తీర్పు వెలువడిన తరువాత దైవప్రవక్త (స) గారి ఆదేశం మేరకు, బనూ ఖురైజాను మదీనాకు తెచ్చి బనూ నజ్జార్‌కు చెందిన ఓ మహిళ - ఈమె హారిస్ కుమార్తె - ఇంట ఖైదు చేయడం జరిగింది. మదీనా వీధుల్లో కందకాలు

https://teluguislam.net



త్రవ్వి వారిని ఒక్కొక్క బృందంగా తెచ్చి మెడలు నరికి ఆ కందకాల్లో పడ వేయడం జరుగుతోంది. ఈ పని ప్రారంభం అయిన కొంత సేపటికి మిగిలిన ఖైదీలు తమ సర్దారు కఅబ్ బిన్ అసద్‌తో, "మీ అభిప్రాయం ఏమిటి? మా ఎడల వారు ప్రవర్తించే తీరు ఎలాంటిది?" అని అడగగా అతను,

"మీకు రవ్వంత జ్ఞానమైనా ఉందా? అలా అడుగుతున్నారు. చూడడం లేదా పిలిచేవాడు పిలుస్తూనే ఉన్నాడు. వెళ్ళినవారు తిరిగి రావ డమూ లేదు. దైవసాక్షి! ఇది హత్య తప్ప మరేమీ కాదు" అని అన్నాడు.

ఎలాగైతేనేమి (వారి సంఖ్య మొత్తం ఆరు మరియు ఏడు వందల లోపులో ఉంటుంది) అందరి మెడలు నరికి పూడ్చివేయడం జరిగింది.

ఈ చర్య వల్ల కుట్రదారులైన ఈ సర్పాల తలలు చితకకొట్టబడ్డాయి. వారంతా అంతమైపోయారు. వీరు దృఢమైన ఒడంబడికను త్రుంచి దాన్ని కాలరాచిన వారు. ముస్లిములను తుదముట్టించడానికి, అతి క్లిష్టమైన పరిస్థితిలో శత్రువుకు సహాయపడి పెద్ద నేరానికి పాల్పడ్డవారు వీరు. ఇప్పుడు వారి చావుకు వారే స్వయంగా కారకులయ్యారు.

బనూ ఖురైజా వినాశనానికి గురి అయిన వెంటనే బనూ నజీర్ తెగకు చెందిన సర్దారు, ఈ యుద్ధానికి సంబంధించిన పెద్ద నేరగాడు హుయ్ బిన్ అఖ్తబ్ కూడా అంతం చేయబడ్డాడు. ఇతను ఉమ్ముల్ మోమినీన్ (ముస్లి ముల మాతృమూర్తి) హజ్రత్ సఫియ్యా (ర) గారి తండ్రి. ఖురైష్ మరియు గత్ఫాన్ వెనక్కు మళ్ళిపోయిన తరువాత బనూ ఖురైజా దిగ్బంధానికి గురి అయినప్పుడు వారి వెంటే అతనూ, తాను చేసిన శపథం ప్రకారం వారితోనే కోటలోనికి వెళ్ళి దాక్కున్నాడు. అహ్జాబ్ యుద్ధం జరిగే రోజుల్లో ఇతను కఅబ్ బిన్ అసద్‌ను ముహమ్మద్ (స)కు వ్యతిరేకంగా తిరగబడి ద్రోహం చేయడానికి పురికొల్పినవాడు. అతను ఇప్పుడు కఅబ్‌కు ఇచ్చిన ఆ మాటను నిలబెట్టు కుంటున్నాడు.

అతణ్ణి పట్టి దైవప్రవక్త (స) వద్దకు తీసుకువచ్చినప్పుడు తన ఒంటిపై మేలైన వస్త్రాలను తొడిగి ఉన్నాడు. వాటిని తాను స్వయంగా చుట్టూ, ఒక్కొక్క అంగుళం మేర చించుకున్నాడు. అతని ఉద్దేశ్యం, తాను మరణించిన తరువాత తన ఈ బట్టలు యుద్ధ ధనానికి పనికిరాకుండా ఉండాలి అన్నదే.

https://teluguislam.net



అతని రెండు చేతులు మెడ వెనుకకు వేసి కట్టబడి ఉన్నాయి. అతను దైవప్రవక్త (స)ను సంబోధిస్తూ, "వినండి! నేను మీ ఎడల శత్రుత్వం వహించి నందుకు సిగ్గుపడడం లేదు. కాని అల్లాహ్‌తో యుద్ధం చేసిన వాడు ఓడిపోక తప్పదు" అన్నాడు. ఆ తరువాత అక్కడున్న వారిని సంబోధిస్తూ :

"ప్రజలారా! అల్లాహ్ ఇచ్చిన తీర్పులో తేడా ఏదీ లేదు. ఇది మా పాలిట రాయబడిన దురదృష్టం. ఇది బనీ ఇస్రాయీల్ కోసం రాసిపెట్టి ఉంచిన పెద్ద హత్యాకాండ" అంటూ కూర్చోగా అతని తల నరికివేయబడింది.

ఈ సంఘటనలో బనూ ఖురైజాకు చెందిన ఓ స్త్రీని కూడా చంపడం జరిగింది. ఆమె హజ్రత్ ఖల్లాద్ బిన్ సువైద్ (ర) పై తిరుగల బండ విసిరి చంపిన స్త్రీ. దీనికి బదులుగా ఆమెను హతమార్చడం జరిగింది.

మహాప్రవక్త (స), నాభి క్రింద వెంట్రుకలు మొలిచిన ప్రతివాణ్ణి చంప మని ఆదేశం ఇచ్చి ఉన్నారు. అయితే అతియా కర్జీకి ఇంకా వెంట్రుకలు మొలవలేనందున ఆమెను వదలివేయడం జరిగింది. ఆ తరువాత ఆమె ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి దైవప్రవక్త (స) గారి సహచరుల్లో చేరారు.

హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (ర), 'జుబైర్ బిన్ బాతా' మరియు ఆయన కుటుంబ సభ్యులను తనకు హిబా చేయమని అర్థించగా ఆయన ఆ విన్న పాన్ని స్వీకరించి హిబా చేశారు. ఇది వరకు జుబైర్ సాబిత్‌ను ఆదుకొని ఉండ డమే దానికి కారణం. ఆ తరువాత సాబిత్ బిన్ ఖైస్ (ర) జుబైర్‌తో దైవప్రవక్త (స) నిన్నూ నీ కుటుంబాన్నీ నా కోసం హిబా చేసి ఉన్నారు. ఇప్పుడు వారం దరిని నీకు అప్పజెప్పేస్తున్నాను (అంటే వారందరిని స్వతంత్రులుగా చేస్తున్నా నని అర్థం) అన్నారు. కాని ఆ తరువాత జుబైర్‌కు తన జాతి అంతా అంతం అయిపోయిందన్న విషయం తెలియగా అతను, "జుబైర్! నేను నీకు చేసిన సహాయానికి ప్రతిగా నన్ను నా మిత్రుల్లా అంతమొందించు" అని అడగగా జుబైర్, బాతాను కూడా చంపేయడం జరిగింది. అయితే జుబైర్ కుమారుడు అబ్దుర్రహ్మాన్‌ను మాత్రం అలానే వదిలివేశారు. తరువాత ఆయన ఇస్లామ్ స్వీకరించి ముస్లిములైపోయారు. అలాగే బనూ నజ్జార్‌కు చెందిన ఓ మహిళ హజ్రత్ ఉమ్ముల్ మున్జిర్ సల్మా బిన్తె ఖైస్ చేసిన అభ్యర్థన మేరకు సమ్ వాయిల్ ఖర్జీ కుమారుడు రిఫాఅను ఆమె కోసం హిబా చేయడం జరిగింది. రిఫాఅను ఆమెకు అప్పగించారు. ఆమె రిఫాఅకు జీవితం ఒసగారు. ఆ

https://teluguislam.net



తరువాత ఆయన కూడా ఇస్లామ్ స్వీకరించి దైవప్రవక్త (స)కు సహచరులయ్యారు.

మరికొందరు వ్యక్తులు ఆయుధాలు పడవేసేముందే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం వలన వారి ఆస్తిపాస్తులు, ధన ప్రాణాలు అన్నీ సురక్షితంగానే ఉండిపోయాయి. అదే రాత్రి, బనూ ఖురైజా చేసిన కుట్రలో పాలుపంచుకోకుండా, ఒప్పందాన్ని భంగపరిచినవారికి దూరంగా ఉన్న వ్యక్తి బయటకు రాగా, పహరా కాస్తున్న కమాండరు ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర) చూశారు. కాని అతణ్ణి గుర్తు పట్టి వదలివేయడం జరిగింది. ఆ తరువాత అతను ఎటు వెళ్ళిపోయాడో తెలియరాలేదు.

బనూ ఖురైజా యూదులకు చెందిన ఆస్తులు, ధన సంపద నుండి దైవప్రవక్త (స) ఖుమ్స్ తీసి అందరికీ పంచిపెట్టారు. అశ్వారూఢులకు మూడు భాగాలు ఇచ్చారు. ఆ మూడు భాగాల్లో రెండు భాగాలు గుర్రాలవి, ఒక భాగం సైనికునిది. పదాతిదళానికి ఒక భాగం పంచిపెట్టారు. ఖైదీలను, పిల్లలను హజ్రత్ సఅద్ బిన్ జైద్ పర్యవేక్షణలో నజద్‌కు పంపించి, బదులుగా గుర్రాలను, ఆయుధాలను కొనడం జరిగింది.

దైవప్రవక్త (స) తన కోసం బనూ ఖురైజా స్త్రీలలో ఒకామె హజ్రత్ రీహానా బిన్తె అమ్రూ బిన్ ఖనాఫాను ఎంచుకున్నారు. ఈమె ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, దైవప్రవక్త (స) గారి మరణం వరకు ఆయన ఆధీనంలోనే ఉన్నారు.[1] కాని కలబీ కథనం ప్రకారం, దైవప్రవక్త (స) ఆమెను హిజ్రీశకం ఆరులో స్వతంత్రురాలిగా చేసి వివాహమాడినట్లు ఉంది. ఆయన చివరి హజ్ (హజ్జతుల్ విదా) నుండి తిరిగి వచ్చేటప్పటికి ఆమె చనిపోయారని, ఆమెను బకీ ఖనన వాటికలో ఖననం చేశారని ఉంది.[2]

బనూ ఖురైజా పని పూర్తిగా పట్టిన తరువాత హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) గారి వేడుకోలు స్వీకరించబడే తరుణం ఆసన్నమైంది. ఈ దుఆ ఏమిటో గజ్వాయె అహ్‌జాబ్ సందర్భంలో మనం చెప్పుకున్నదే. కాబట్టి ఆయన గాయం తిరిగతోడింది. ఆయన అప్పుడు మస్జిదె నబవీలో ఉన్నారు. దైవ ప్రవక్త (స), ఆయన్ను పరామర్శించే ఉద్దేశ్యంతో అక్కడనే ఓ గుడారం వేయించి ఉంచారు. హజ్రత్ ఆయిషా (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, ఆయన

1. ఇబ్నె హష్షామ్-2/245 2. తల్ఖీహుల్ ఫహూమ్-పుట. 12

https://teluguislam.net



గాయం పగిలి రక్తం ప్రవించనారంభించింది. ఆ మసీదులోనే బనూ గిఫ్ఫార్‌కు చెందిన కొన్ని గుడారాలు కూడా ఉన్నాయి. ఆ రక్తం ప్రవించి వారి వైపునకు రానారంభించినందున దాన్ని చూసి భయపడ్డారు. వారు గుడారవాసులతో, "ఓ గుడారవాసులారా! ఇదేమిటీ మన వైపునకు వస్తున్నది, కొంచెం చూడండి" అని అరిచారు. చూడగా అది హ(జత్ సఅద్ (ర) గారి గాయం నుండి ప్రవించి వస్తున్న రక్తం. ఆ రక్తస్రావం వల్లనే ఆయన మరణం సంభవించింది.[3]

సహీ యైన్ గ్రంథాల్లో ఉటంకించిన హ(జత్ జాబిర్(ర) గారి ఉల్లేఖనంలో మహాప్రవక్త (స) ఇలా ప్రవచించారని ఉంది:

"సఅద్ బిన్ ముఆజ్ (ర) గారి మరణంతో రహ్మాన్ సింహాసనం కదిలిపోయింది."[4] ఇమామె తిర్మిజీ, హ(జత్ అనస్ (ర) గారి ఉల్లేఖనాన్ని ఉటంకించి అది ప్రామాణికమైనదని చెబుతూ, హ(జత్ సఅద్ బిన్ ముఆజ్ జనాజాను (శవపేటికను) ఎత్తినప్పుడు మునాఫిక్‌లు ఆశ్చర్యంగా, వీరి జనాజా ఇంత తేలిగ్గా ఉందేమిటీ అని అన్నారు. దానికి మహాప్రవక్త (స), దాన్ని దైవ దూతలు ఎత్తుకున్నారు (కాబట్టి అది మీకు తేలికగా అనిపిస్తోంది) అని అన్నారు.[5]

బనూ ఖురైజా దిగ్బంధం జరుగుతున్న సమయంలోనే ఓ ముస్లిమ్ అమరగతి పొందాడు. ఆయన పేరు ఖల్లాద్ బిన్ సువైద్ (ర). ఈయనపై బనీ ఖురైజాకు చెందిన ఓ స్త్రీ తిరుగలి బండను ఎత్తి పడేసి చంపేసింది. ఈయన కాకుండా హ(జత్ అక్కాషా (ర) గారి సోదరుడు అబూ సనాన్ బిన్ ముహ్సిన్ కూడా ఈ దిగ్బంధం సందర్భంగానే మరణించారు.

అబూ లుబాబా (ర) గారి విషయానికొస్తే, ఆయన ఆరు రాత్రిళ్ళు తనను తాను మస్జిద్ కంబానికి వేసి కట్టుకునే ఉన్నారు. ఆయన భార్య నమాజు సమయం కాగానే వచ్చి ఆయన కట్లను విప్పేసేవారు. నమాజు పూర్తి అయిన తరువాత తిరిగి ఆయన తనను ఆ కంబానికి వేసి కట్టుకునేవారు. ఆ తరువాత మహాప్రవక్త (స) పై తౌబా సూరా అవతరించింది. ఆ సమయంలో ఆయన (స) ఉమ్మె సల్మా (ర) గారి ఇంట ఉన్నారు. అబూ

3. సహీ బుఖారి-2/591
4. సహీ బుఖారి-1/536; సహీ ముస్లిమ్-2/294; జామయె తిర్మిజీ-2/225
5. జామయె తిర్మిజీ-2/225

https://teluguislam.net



లుబాబా (ర) స్వయంగా ఈ సంఘటన గురించి చెబుతూ, హజ్రత్ ఉమ్మె సల్మా (ర) గారు తన గది ద్వారం వద్ద నిలబడి నాతో, "ఓ అబూ లుబాబా! సంబరపడు. అల్లాహ్ నీ తౌబాను స్వీకరించాడు" అన్నారు. అక్కడ దాపులో ఉన్న సహాబా (ర)లు ఇది విని ఆయన కట్లు ఊడదీయడానికి పరుగున వచ్చారు. కాని ఆయన వారు తన కట్లను విప్పడాన్ని అంగీకరించలేదు. నా కట్లను దైవప్రవక్త (స) తప్ప మరెవ్వరూ విప్పడానికి వీల్లేదు అని అన్నారు. మహాప్రవక్త (స) ఆయన ప్రక్క నుండి పోతున్నప్పుడు తన స్వహస్తాలతో ఆయన కట్లు విప్పి స్వతం త్రులుగా చేశారు.

ఈ గజ్వా జీఖాదా నెలలో సంభవించిన గజ్వా. దాదాపు ఇరవై అయిదు రోజుల వరకు యూదుల్ని దిగ్బంధించి ఉంచడం జరిగింది.[6] అల్లాహ్ ఈ గజ్వా మరియు గజ్వయె అహ్జాబ్ గురించిన వివరాలను తెలుపుతూ అల్ అహ్జాబ్ సూరాలో అనేక ఆయత్‌లు అవతరింపజేశాడు. ఈ రెండు పోరాటాలకు సంబంధించిన విషయాలను విడమర్చి చెప్పాడు అందులో. మోమిన్‌లు (విశ్వాసులు) మరియు మునాఫిక్‌ల (కపట ముస్లిముల) పరిస్థితుల్ని వివరించాడు. విరోధి పక్షానికి సంబంధించిన వర్గాల్లో చీలిక ఎలా ఏర్పడిందో, వారు భయానికి ఎలా లోనయ్యారో వివరించి చెప్పాడు. అదే కాకుండా గ్రంథవహుల (యూదుల) వాగ్దానభంగం వల్ల ఎలాంటి ఫలితాలు చోటుచేసుకున్నాయో వివరించాడు.

---

*6. ఇబ్నె హష్షామ్-2/237, 238. గజ్వా వివరాల కోసం చూడండి, ఇబ్నె హష్షామ్-2/233-237 వరకు. సహీ బుఖారి-2/590, 591; జాదుల్ ముఆద్-2/72, 74. ముక్తతుస్సీరత్- షేక్ అబ్దుల్లాహ్, పుట. 287, 288, 289, 290.*